


RNI No. TEL/TEL/2018/76342

# లోకంతీరు

LOKAMTEERU TELUGU DAILY సామాజిక, రాజకీయ దిన పత్రిక

ప్రచురణ : నిజామాబాద్ ఆదివారం 11-02-2024 ఎడిటర్ : బ్యాగల్ శ్రీనివాస్ సంపుటి : 06 సంచిక : 39 పేజీలు : 4 వెల : రూ 2-00

## మహిళలకు గుడ్‌న్యూస్ చెప్పిన సజ్జనార్

హైదరాబాద్: ఈ నెల 21 నుంచి 24 వరకు మేడారం జాతర జరుగనుంది. ఇక, ఈసారి మేడారం జాతర కోసం భక్తులు ఇప్పటి నుంచే పోటెత్తుతున్నారు. దీంతో, టీఎస్ఆర్టీసీ ప్రయాణీకుల కోసం ప్రత్యేక బస్సులను నడుపుతోంది. ఇదే సమయంలో మేడారం జాతరకు కూడా ఆర్టీసీ బస్సుల్లో మహాలక్ష్మి పథకం అమలులో ఉంటుందని ఎండీ సజ్జనార్ తెలిపారు. కాగా, తాజాగా సజ్జనార్ మీడియాతో మాట్లాడుతూ..'మేడారం జాతరకు టీఎస్ఆర్టీసీ 6000 ప్రత్యేక బస్సులు నడుపుతుంది. మేడారం జాతరలో 51 బేస్ పాయింట్లను ఏర్పాటు చేశాం. ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్. ఖమ్మం జిల్లాల నుంచి ఎక్కువ సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉంది.

# ఐదేళ్లలో దేశంలో అనేక రంగాల్లో అభివృద్ధి



**ఆర్టికల్ 370 తొలగింపుతో పూర్తి రాజ్యాంగం ఆవిష్కృతం**
**రిఫామ్, పర్‌ఫామ్, ట్రాన్స్‌ఫామ్ లక్ష్యంగా ఐదేళ్ల పాలన**
**పార్లమెంట్‌లో చివరి రోజు ప్రధాని మోడీ ప్రసంగం**

న్యూఢిల్లీ,ఫిబ్రవరి10 ): ఈ ఐదేళ్ల కాలంలో దేశంలో ఎన్నో రంగాల్లో అభివృద్ధి సాధించామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. పార్లమెంట్ సమావేశాల చివరిరోజు సందర్భంగా లోక్‌సభలో ప్రధాని ప్రసంగించారు. ఈ సమావేశాల్లో పలు కీలక నిర్ణయాలు తీసుకు న్నామన్నారు. ఆర్టికల్ 370ను తొలగించడం ద్వారా రాజ్యాంగం పూర్తిగా ఆవిష్కృతమైందని ప్రధాని మోదీ అన్నారు. తద్వారా జమ్మూ కశ్మీర్ ప్రజలకు సామాజిక న్యాయం అందించగలుగుతున్నామని అన్నారు. జీ-20కి అధ్యక్షత వహించే అవకాశం భారత్‌కు దక్కిందని, వ్యవస్థలు మారినా దేశ ప్రజాస్వామ్య స్ఫూర్తి ఎప్పుడూ మారదని చెప్పారు. కరోనా సమయం లో కూడా దేశ కార్యక్రమాలు ఆగిపోనివ్వలేదని దేశ ఆర్థిక వ్యవస్థకు ప్రతి ఒక్కరూ తోడ్పాటు అందించారని కొనియాడారు. ఆ సమయంలో ఎంపీలు సైతం తమ నిధులను వదులుకున్నారని పేర్కొన్నారు. అందుకు ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని ప్రధాని మోదీ అన్నారు. దేశానికి మరోసారి తీర్మానాలను జాతి పాదాల చెంత అంకితం చేసే అవకాశం వచ్చింది. ఈ ఐదేళ్లు దేశంలో జరిగిన సంస్కరణలు, పనితీరు, పరివర్తనలతో కొత్త నమ్మకం పెరుగుతోంది.'ఈ ఐదేళ్లు దేశంలో రిఫామ్, పర్‌ఫామ్, ట్రాన్స్‌ఫామ్ సంబంధించినవి. సంస్కరణలు, పనితీరు కారణంగా జరిగిన పరివర్తనను మనం చూడగలుగుతున్నాం. లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలలో మహిళలకు 33 శాతం సీట్లు రిజర్వ్ చేసే చట్టాన్ని 17వ లోక్‌సభ హయాంలో ఆమోదించాం. కొత్త పార్లమెంట్ లో ఆమోదించిన తొలి బిల్లు కూడా ఇదే. సభ తీసుకున్న అత్యంత ముఖ్యమైన నిర్ణయాల్లో ఇది ఒకటి. మహిళలకు వారి హక్కులను కల్పించాలనేదే మా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని నరేంద్ర మోదీ అన్నారు. మూడో దఫా ప్రభుత్వంలో మరిన్ని కీలక నిర్ణయాలు తీసుకుంటామని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. తమ పాలనలో దేశ ప్రజల్లో విశ్వాసం పెరిగిందని ప్రధాని మోదీ అన్నారు. గత ఐదేళ్లలోఅద్భుతమైన మార్పులు ఆవిష్కరణలు తీసుకువచ్చామని చెప్పారు. దేశాన్ని తామెప్పుడూ వెనకడుగు వేయనివ్వలేదన్నారు. 'ఎన్నో ఏళ్ల కల అయిన కొత్త పార్లమెంట్ భవనాన్ని నిర్మించుకున్నాం. కరోనా లాంటి విపత్కర పరిస్థితిని సమర్థవంతంగా ఎదుర్కొన్నాం. జీ20 సమావేశాన్ని నిర్వహించడం వల్ల భారత్ ప్రతిష్ట పెరిగింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా మార్పు కనిపిస్తోంది. పేపర్‌లెస్ పార్లమెంట్, డిజిటలైజేషన్ సభ్యులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. గత పదేళ్లలో దేశంలో ఉత్పాదకత పెరిగింది. ఈ టర్మ్‌లో పార్లమెంట్ సమావేశాల్లో చేసిన అనేక సంస్కరణలు గేమ్ చేంజర్లుగా మారాయి. ఉగ్రవాద నిర్మూలనకు తీసుకున్న చర్యల వల్ల కాశ్మీర్‌లో శాంతి పెరిగింది' అని మోదీ తెలిపారు. బీజేపీ పాలనలో అద్భుత ప్రగతి, దేశ ప్రజల ఆత్మవిశ్వాసం పెరిగిందన్నారు ప్రధాని మోదీ. ఐదేళ్లలో అనేక సంస్కరణలు తీసుకొచ్చామన్నారు. ఐదేళ్లలో దేశంలో ఉత్పాదకత భారీగా పెరిగిందని చెప్పారు. కరోనా విపత్తును సమర్థవంతంగా ఎదుర్కొని దేశ ప్రజలను కాపాడామన్నారు. కరోనా సమయంలో ఎంపీలు తమ జీతాను ప్రజలకిచ్చి వారిలో ఆత్మవిశ్వాసం పెంచారని ప్రధాని మోదీ అన్నారు. పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు అనేక చర్యలు చేపట్టామన్నారు. ఎన్ని విపత్తులు వచ్చినా దేశంలో అభివృద్ధి ఆగలేదని ప్రధాని మోదీ అన్నారు.

# రూ.2,75,891 కోట్లతో ఓటాన్ అకౌంట్ బడ్జెట్



హైదరాబాద్,ఫిబ్రవరి10(ఆర్ ఎన్ఎ):తెలంగాణలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.2,75, 891 కోట్ల అంచనాలతో ఓటాన్ ఎకౌంట్ బడ్జెట్‌ను అసెంబ్లీలో ఆర్థికమంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టారు. రూ.2,01,178 కోట్ల రెవెన్యూ వ్యయం, రూ.29, 669 కోట్ల మూలధన వ్యయం తో కొత్త ప్రభుత్వ తొలి పద్దును ప్రతిపాదించారు. మార్పు కోరు తూ తెలంగాణ ప్రజలు స్వేచ్ఛను సాధిం చుకున్నారని.. వారికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు చెబుతున్నట్లు బడ్జెట్ ప్రసంగంలో భట్టి తెలిపారు. సామా జిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని అందించే స్ఫూర్తితో బడ్జెట్‌ను ప్రతిపాదించినట్లు వివరించారు. గత ప్రభుత్వ పథకాలు గొప్ప.. అమలుకు దిబ్బ అన్నట్లుగా ఉండేవ న్నారు. నీళ్లు, నిధులు, నియామకాలు అనే మూడు అత్యంత ప్రధానమైన అంశాలను దృష్టిలో ఉంచుకొని తెలంగాణ రాష్ట్రంలో విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలు, ఉపాధి కల్పన పెంచడం ద్వారా సమగ్ర అభివృద్ధి సాధిస్తామన్నారు. గత పాలకులు ప్రభుత్వ ఖజానాను దివాలా తీయించారు. ప్రణాళిక లేకుండా, హేతుబద్ధత లేకుండా వారు చేసిన అప్పులు ఇప్పుడు పెద్ద సవాళ్లుగా మారాయి. అయితే ప్రణాళికాబద్ధమైన ఆలోచనలతో, సహేతుకమైన కార్యచరణతో ఈ సవాళ్లను అధిగమిస్తామన్నారు. దుబారా వ్యయాన్ని గణనీయంగా తగ్గిస్తుందన్నారు భట్టి. కాళేశ్వరం ప్రాజెక్టు లాంటి నిరర్థకమైన ఆస్తులు పెంచుకుటూ వాటిని తెలంగాణ ప్రజలకు భారంగా చేయడం మా విధానం కాదన్నారు. కేవలం తెలం గాణ ప్రజలు అభివృద్ధి చెందడం, వారు సంతోషంగా ఉండటం మాత్రమే మా లక్ష్యం అన్నారు. దీనికి అనుగుణంగానే తమ ప్రభుత్వ విధానాలు ఉంటాయని బడ్జెట్ లో ప్రతిపాదనలు చేశామన్నారు. గత పాలకుల నిర్వాకంతో ధనిక రాష్ట్రం ఆర్థిక కష్టాల పాలైందని చెప్పారు. గత ప్రభుత్వ అప్పులను అధిగమించి అభివృద్ధిలో సంతులిత వృద్ధి లక్ష్యంగా ముందుకెళ్తామని వెల్లడించారు. రైతుల రుణమాఫీపై ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క అసెంబ్లీలో కీలక ప్రకటన చేశారు. ఓటాన్ అకౌంట్ బడ్జెట్ సందర్భంగా ఆయన రైతు రుణమాఫీపై గుడ్ న్యూస్ చెప్పారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు రైతు రుణమాఫీ పథకాన్ని అమలు చేస్తామని.. రూ.2 లక్షల రుణమాఫీపై త్వరలోనే కార్యాచరణ ఉంటుందని.. దీనికి సంబంధించి విధి విధానాలను రూపొందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి పంటకు మద్దతు ధర కూడా అందిస్తామని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని కౌలు రైతులకు కూడా రైతు భరోసా సాయాన్ని ఇచ్చేందుకు మార్గదర్శకాలు సిద్ధం చేస్తున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. రైతుబంధు నిబంధనలు పునఃసమీక్షించి నిజమైన అర్హులకు రైతు భరోసా కింద రూ.15 వేలు అందిస్తామన్నారు. అలాగే, ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన ఆధారంగా రాష్ట్రంలో పంటల బీమా పథకాన్ని అమలు చేయబోతు న్నట్లు తెలిపారు. ఈ పథకాన్ని కౌలు రైతులకూ వర్తింప చేసేందుకు మార్గదర్శకాలు రూపొందిస్తున్నామని చెప్పారు.

# కాంగ్రెస్‌ది పూర్తిగా తిరోగమన బడ్జెట్




**హామీలను నెరవేర్చాలని చిత్తశుద్ధి లేదు**
**నిరుద్యోగులను, యువకులకు ప్రభుత్వం మోసం**
**సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి విమర్శ**

సూర్యాపేట,ఫిబ్రవరి10( :కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా తిరోగమన బడ్జెట్ అని.. ఆరు గ్యారంటీలను అకెక్కించే బడ్జెట్ అని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి విమర్శించారు. సూర్యాపేటలో మీడియా సమావేశంలో పాల్గొన్న ఆయన కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై విరుచుకుపడ్డారు. ఇచ్చిన హామీలను నెరవేర్చాలని చిత్తశుద్ధి కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని నేటితో తేలిపోయిందన్నారు. ప్రభుత్వానికి ఐదు నుంచి 6 నెలల సమయం ఇవ్వాలని మా నేత కేసీఆర్ చెప్పారన్నారు. రైతులను చెప్పులతో కొట్టండి అనే మాట్లాడే అహంకారాన్ని ప్రశ్నించకుండా ఎలా ఉంటామని ప్రశ్నించారు. ఇలాంటి మోసపూరిత బడ్జెట్‌ను దేశ చరిత్రలో ఏ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు ప్రవేశపెట్టలేదని విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ గెలుపును భుజస్కందాలపై మోసిన నిరుద్యోగులను, యువకులను ప్రభుత్వం నిండా మోసం చేసిందని దుయ్యబట్టారు. రూ.2లక్షల రుణమాఫీ ఒకేసారి చేస్తామన్న ప్రభుత్వం రుణమాఫీ ప్రస్తావనే బడ్జెట్‌లో తీసుకురాలేదన్నారు. రైతుబంధు రూ.15వేలు చేస్తామని, అన్ని పంటలకు రూ.500 బోనస్ ఇస్తామని ఇచ్చిన హామీలను వ్యవసాయ పద్దుల్లో ఎక్కడ కూడా ఆ ప్రస్తావనే లేదన్నారు. మహిళలకు ఉచిత ప్రయాణం వారిపై ప్రేమతో పెట్టలేదని.. వారి పర్సులు కొట్టేయడం కోసమేనన్నారు. అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఈ రోజు నిజమయ్యాయన్నారు. మహిళలకు నెలకు రూ.2500 ఇస్తామన్న ప్రభుత్వం ఎక్కడ బ్జడెట్‌లో కేటాయింపులు చేయలేదన్నారు. ఏ పథకమైన బ్జడెట్లో ప్రవేశపెడితేనే వస్తాయన్న ఆయన ఆటోవాలాలకు ఇస్తామన్న రూ.12వేల ప్రస్తావన ఎక్కడా తెలేదన్నారు. ఆటో కార్మికులను అవమానించేకరంగా ముఖ్యమంత్రి వ్యాఖ్యలు ఉన్నాయన్నారు. అన్ని వర్గాలను మోసం చేసే విధంగాబడ్జెట్ ఉందన్నారు. దళితులు, గిరిజన అభివృద్ధిపై ఎక్కడా కూడా కేటాయింపులు లేవన్న ఆయన ఉన్న పథకాలను తీసేసి ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం నిండా ముంచిందన్నారు. గృహజ్యోతి పథకం ద్వారా అందరికీ 200 యూనిట్ల విద్యుత్ బిల్లు మాఫీ అన్న ప్రభుత్వం, కొత్త దరఖాస్తులు తీసుకోవడం ఎందుకని ప్రశ్నించారు. విద్యుత్ రంగ సంస్థల ద్వారా పథకాన్ని నేరుగా అమలు చేసే అవకాశం ఉందన్నారు. గృహజ్యోతి పథకానికి కేటాయించిన బ్జడెట్ రాష్ట్రంలో పావుల శాతం మందికి కూడా సరిపోవు అన్నారు. ఇంత దగాపూరిత మోసపూరిత బడ్జెట్ ఎప్పుడూ చూడలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ అసలు రంగు తెలంగాణ ప్రజలకు నేడు తెలిసిందన్నారు. తెలివి లేక అయినా లేదా.. మోసం చేయాలని ధోరణితోనే బడ్జెట్ ఉందన్నారు. ప్రభుత్వంపై తెలంగాణ ప్రజలు తస్మాత్ జాగ్రత్తగా ఉండాలన్న జగదీశ్ రెడ్డి, గ్రామాల్లోకి వచ్చే ప్రభుత్వ ప్రజాప్రతినిధులను ఆరు గ్యారంటీ అమలుపై ఎక్కడికక్కడ నిలదీయాలని పిలుపునిచ్చారు. ఃూష్ట్ర ప్రయోజనాల కోసం కృష్ణాజాలపై హక్కును కాపాడుకోవాలన్న సోయి లేని కాంగ్రెస్ ప్రభుత్వం మేడిగడ్డ కాదు కదా యే గడ్డకు పోయినా గట్టెక్కలేరని జగదీశ్ రెడ్డి ఎద్దేవా చేశారు. కేఆర్ఎంబీలో సంతకాలు పెట్టి అడ్డంగా దొరికిపోయారన్నారు. సంతకాలు పెట్టింది మాకు తెలవదనడం సిగ్గుచేటన్నారు.

# ప్రభుత్వ హామీని అమలు చేసిన ఘనత ఆర్టీసీదే

**తెలంగాణ ఉద్యమంలో కార్మికులదే కీలక పాత్ర**
**కొత్తగా వంద బస్సులను ప్రారంభించిన సిఎం రేవంత్**





హైదరాబాద్,ఫిబ్రవరి10 : ప్రభుత్వ హామీని తొలిసారి అమలు చేసింది ఆర్టీసీ కార్మికులేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. టీఎస్ ఆర్టీసీ కొత్తగా అందుబాటు లోకి తెచ్చిన 100 ఆర్టీసీ బస్సులను శనివారం సాయంత్రం హైదరాబా ద్‌లో సీఎం ప్రారంభించారు. ఎన్టీ ఆర్ మార్గ్‌లో 100 కొత్త బస్సులను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్కలతో కలిసి రేవంత్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. 'కొత్త రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇప్పుడు కొత్త బస్సులు ప్రారంభించుకుంటున్నాం. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడు తూ... తెలంగాణ ఉద్యమంలో ఆర్టీసీ కార్మికులది కీలక పాత్ర అని కొనియాడారు. రాష్ట్రం ఏర్పడితే తమ సమస్యలు పరిష్కారమవుతాయని వారు ఆశించారు.. కానీ, అలా జరగలేదు. సమస్యల పరిష్కారం కోసం కార్మికులు చేసిన ఆందోళనలో 36 మంది చనిపోయారు. సమ్మెకు దిగారని ఆర్టీసీ కార్మిక సంఘాలను నాటి సీఎం రద్దు చేశారు. ప్రజాప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లోనే మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించాం. గత ప్రభుత్వం రూ.2.97లక్షల కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టింది. కానీ, మేం వాస్తవ లెక్కలతో బడ్జెట్ రూపొందించాం. గతేడాది కంటే రూ.15వేల కోట్లు తక్కువతో బడ్జెట్ ప్రవేశపెట్టాం'అని సీఎం తెలిపారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ ఎండీ సజ్జనార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సంద ర్భగా తెలంగాణ ఉద్యమంలో ఆర్టీసీ పాత్ర ఎవరు మర్చిపోరని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ఉద్యమాన్ని ఆర్టీసీ కార్మికులు ముందుండి నడిపించారని గుర్తు చేశారు. రాష్ట్రం ఏర్పడితే సమస్యలు పరిష్కరిస్తారని ఆర్టీసీ కార్మికులు అనుకున్నారు కానీ పరిష్కారం కాలేదు. గత ప్రభుత్వం మిమ్మల్ని విస్మరించింది. ఎంతో మంది ఆర్టీసి కార్మికులు ప్రాణ త్యాగం చేశారు. అయినా గత ప్రభుత్వం పట్టించుకోలేదు. గత ప్రభుత్వాన్ని గద్దె దింపడానికి మీ కృషి ఏంతో ఉంది. మహాలక్ష్మి స్కీమ్‌ను మేనిఫెస్టోలో పెట్టాం. ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే ఈ పథకం అమలు చేశాం. 15 కోట్ల 27 లక్షల మంది మహిళలు ఆర్టీసి లో ఉచితంగా ప్రయాణం చేశారని అన్నారు.

# బడ్జెట్‌పై హరీశ్‌రావు కీలక వ్యాఖ్యలు



,హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వ బడ్జెట్ తీవ్ర నిరాశ పరిచిందని, ప్రజాపాలన అబాసుపాలయ్యిందని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ వాగ్దాన భంగాలేనన్నారు. బడ్జెట్‌పై శనివారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో హరీశ్‌రావు మాట్లాడారు.'బడ్జెట్ ప్రజలకు నమ్మకం ఇవ్వలేదు. అన్నదాతలను అగం చేసే విధంగా ఉంది. అంకెలు మార్చి ఆంక్షలు పెట్టే విధంగా బడ్జెట్ ఉంది. వ్యవసాయ రంగానికి కేటాయించిన 19 వేల కోట్ల నిధుల్లో రైతు భరోసా ఎలా అమలు చేస్తారు ? రైతు భరోసాకు 22 వేల కోట్ల రూపాయలు అవసరం. రైతు రుణమాఫీ కి మొండి చేయి చూపారు. రైతు బీమకు కేటాయింపులు ఎక్కడ ? పంటలకు బోనస్ ఇస్తామని చెప్పిన మాటలు బోగస్ గా మారాయి. రైతులను దగా చేసింది కాంగ్రెస్ ప్రభుత్వం. అసెంబ్లీలో ప్రభుత్వం అబద్ధాలు చెబుతోంది. 24 గంటల కరెంట్ సరఫరా ఎక్కడ ఇస్తున్నారో చూద్దాం పదండి. లాగ్ బుక్‌లు పరిశీలిద్దాం రండి. ఆరు గ్యారంటీలపై చట్టం చేస్తామని చెప్పారు. రెండు సమావేశాలు అయిపోతున్నాయి ఎక్కడ చట్టం ? వంద రోజుల్లో హామీలు అమలు చేయలేమని కాంగ్రెస్ ప్రభుత్వం చేతులు ఎత్తేస్తోంది. ప్రభుత్వం పచ్చి అబద్ధాలు చెబుతోంది. జనవరి నెల అసరా పింఛన్లను కాంగ్రెస్ ప్రభుత్వం ఎగ్గొట్టింది. బడ్జెట్‌లో నిరుద్యోగ భృతి ప్రస్తావనే లేదు. ఉద్యోగులకు పెండింగ్ డీఏలు ఇవ్వాల్సి ఉన్నా వాటికి నిధుల కేటాయింపుపై ప్రస్తావనే లేదు' అని హరీశ్‌రావు మండిపడ్డారు.

# ఎన్నికలకు ముందే సీఏఏ అమలు చేస్తాం: అమిత్ షా



ఢిల్లీ: పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ)ను ఈ ఏడాది జరగనున్న లోక్‌సభ ఎన్నికలకు ముందే అమలు చేస్తామని కేంద్రం హోం మంత్రి అమిత్ షా తెలిపారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి 370 సీట్లు, ఎన్డీయేకు 400కు పైగా సీట్లు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో వరుసగా మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు."ముస్లిం సోదరులను తప్పుదారి పట్టిస్తున్నారు. సీఏఏకు వ్యతిరేకంగా రెచ్చగొడుతున్నారు. సీఏఏ పాకిస్తాన్, ఆఫ్ఘనిస్థాన్, బంగ్లాదేశ్‌లలో హింసను ఎదుర్కొని భారతదేశానికి వచ్చిన వారికి పౌరసత్వం ఇవ్వడానికి మాత్రమే ఉద్దేశించబడింది. ఇది ఎవరి భారత పౌరసత్వాన్ని లాక్కోవడానికి కాదు." అని ఈటీ నౌ గ్లోబల్ బిజినెస్ సమ్మిట్ 2024లో అమిత్ షా మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి 370 సీట్లు, ఎన్డీయేకు 400కు పైగా సీట్లు వస్తాయని అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో వరుసగా మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాలపై ఎలాంటి సస్పెన్స్ లేదని, మళ్లీ ప్రతిపక్ష బెంచీలపై కూర్చోవాల్సి వస్తుందని కాంగ్రెస్ సహా ఇతర ప్రతిపక్ష పార్టీలు కూడా గ్రహించినట్లు పేర్కొన్నారు. ఆర్టికల్ 370 రద్దు చేశాం.. కాబట్టి దేశ ప్రజలు బీజేపీని ఆశీర్వదిస్తారని అన్నారు. జయంత్ చౌదరి నేతృత్వంలోని రాష్ట్రీయ లోక్ దళ్ (ఆర్ఎల్‌డి), శిరోమణి అకాలీదళ్ (ఎస్ఎడి), మరికొన్ని ప్రాంతీయ పార్టీలు ఎన్డీయేలో చేరే అవకాశం ఉందా? అనే ప్రశ్నకు.. కుటుంబ నియంత్రణకు పరిధి ఉంది.. కానీ రాజకీయాల్లో కాదు. మరిన్ని పార్టీలు ఎన్డీయే కూటమిలో చేరే అవకాశం ఉందని సూచించారు.

# సంపాదకీయం

ఆదివారం 11-02-2024

## నిన్న పటేల్.. ఇప్పుడు పీవీ...

రాజకీయాలు చిత్రంగా ఉంటాయి. ఎటువైపు నుంచి ఎలాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయో కూడా చెప్పడం కష్టం. వ్యూహాలు.. ప్రతివ్యూహాలకు తోడు.. నాయకుల ఎత్తుగడలు రాజకీయాలను మరింత రసవత్తరంగా మారుస్తాయి. దేశాన్ని సుదీర్ఘ కాలం పాలించిన కాంగ్రెస్ పార్టీకి ఇప్పుడు ఇలాంటి పరిణామాలే ఎదురవుతున్నాయి. తమ వారిగా.. తమ పార్టీ నాయకులుగా.. తమ నేతలుగా ఈ దేశానికి సేవ చేసిన వారికి పొరుగు పార్టీ, కరడు గట్టిన ప్రత్యర్థి పార్టీ బీజేపీ ప్రాధాన్యం ఇవ్వడం.. వారికి ఎనలేని గుర్తింపు తీసుకురావడం.. కాంగ్రెస్ పార్టీ(అచేతన వ్యవహార శైలికి నిదర్శనమని చెప్పాలో.. లేక.. కాంగ్రెస్ పార్టీ వదులుకున్న 'రత్నా'లను వడిసిపట్టుకున్నారని.. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ క్రెడిట్ ఇవ్వాలో ప్రజలు నిర్ణయిస్తారు. కానీ, కాంగ్రెస్ పార్టీకి ఈ పరిణామాలు.. కొరుకుపడవు.. మింగుడు పడవు. కీలకమైన ఎన్నికల సమయంలో ఆ పార్టీని ఎంతగా ఇరుకున పెట్టాలో అంతగానూ ప్రధాని మోదీ ఇరుకున పెట్టేస్తున్నారనే చెప్పాలి. వాస్తవానికి కాంగ్రెస్ పార్టీలో ఎంతో మంది నాయకులు ఉన్నారు. నెహ్రూ నుంచి ఇందిరమ్మ దాకా.. తర్వాత రాజీవ్ వరకు ఎంతో మంది ఆ పార్టీకి వీరవిధేయులుగా సేవలందించారు. వారిలో ఎందరు గుర్తింపు పొందారంటే.. ఇటీవల ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పార్లమెంటులో మాట్లాడుతూ.. "ఆ పార్టీకి కేవలం తమ కుటుంబమే కనిపించింది" అన్నట్టుగానే చెప్పాల్సి ఉంటుంది. ఇదే ఇప్పుడు కాంగ్రెస్ పార్టీకి పెను ప్రమాదంగా మారింది. ఈ దేశానికి అనర్ఘ రత్నాలుగా సేవలందించిన అనేక మందిని ఆ పార్టీ దూరం చేసుకోగా.. బీజేపీ తెలివిగా.. ఒడిసి పట్టుకుంది. ఎన్నికల్లో ఓట్లు దూసుకుంటోంది. దీనికి ప్రత్యక్ష ఉదాహరణలు.. ఒకరు.. ఉక్కుమనిషి.. సర్దార్ వల్లభాయ్ పటేల్ కాగా, రెండో వారు.. తాజాగా భారతరత్న కు ఎంపికైన ధీశాలి.. సంస్కరణల పితామహుడు.. తెలుగువారు.. స్వర్గీయ పాములపర్తి వెంకట నరసింహారావు.సహజంగాఏ దేశ రాజకీయాలు చూసినా.. ప్రత్యర్థి పార్టీకి చెందిన నాయకులను ఇటువైపు పార్టీలో ఎవరూ ప్రశంసించరు. ఏ పార్టీ కూడా వారిని తలుచుకునే అవకాశం ఇవ్వదు. కానీ, కేంద్రంలో ప్రధానిగా నరేంద్ర మోదీ కొలువుదీరిన తర్వాత.. వ్యూహం మారిపోయింది. ప్రత్యర్థి పక్షంలోనూ తమకు కలిసివస్తారని.. తమ కు మేలు చేస్తారని భావించిన నాయకులను ఓన్ చేసుకునే సంప్రదాయానికి తెరదీశారు. పైకి.. వారిని గుర్తించినట్టు ఉంటుంది.. అంతర్గతంగా.. తమ రాజకీయాలు పారినట్టు కూడా ఉంటుంది. ఉభయ కుశలోపరి రాజకీయం అంటే ఇదే! ఇదే వ్యూహానికి మోదీ ప్రభుత్వం 2015లో తీసిన తెరవెనుకు నిలువెత్తు శిల్పంగా కనిపించిన మనిషి.. భారత పూర్వ హోం శాఖ మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్. ఈయనను ఓన్ చేసుకోవడంలో మోదీని మించిన నాయకుడు కానీ.. బీజేపీని మించిన పార్టీ కానీ.. కనిపించలేదు. దేశంలో తొలిసారి.. పటేల్ నిలువెత్తు విగ్రహాన్ని నిర్మించారు. ప్రపంచంలోనే అతి పెద్ద కట్టడంగా ఇది పేరు తెచ్చుకుంది. అయితే.. వాస్తవానికి.. ఈయన పనిచేసింది.. తన జీవిత కాలం తపించింది.. పదవులు పొందింది కూడా.. కాంగ్రెస్‌లోనే కావడం విశేషం. బలమైన సామాజిక వర్గంతోపాటు.. దేశం మొత్తాన్నీ ప్రభావితం చేయగల నాయకుడిగా పేరొందిన ఉక్కు మనిషి.. పటేల్‌ను కాంగ్రెస్ వదిలేసుకుందనడంలో ఎలాంటి సందేహం లేదు. అయితే.. అలాంటినాయకుడిని ఒడిసిపట్టుకోవడంలో ప్రధాని నరేంద్ర మోదీ సక్సెస్ అయ్యారు. గుజరాత్‌కు చెందిన పటేల్‌కు అగ్రతాంబూలం ఇస్తూ.. తొలి ఐదేళ్ల పాలనలో ఆయన పేరు తలవని రోజు.. ఆయన గురించి చెప్పని రోజు లేదంటే అతిశయోక్తి కాదు. ఫలితంగా.. అంతో ఇంతో ఓటు బ్యాంకు ఉన్న గుజరాత్‌లో కాంగ్రెస్ తుడిచి పెట్టుకుపోయింది. దేశానికి సేవలందించిన అనేక మంది ప్రధానుల్లో పీవీ నరసింహారావు ఒకరు. అయితే.. ఆయన గద్దె నెక్కే సమయానికి బొటా బొటి మెజారిటీనే ఉంది. అలాంటి క్లిష్ట పరిస్తితికి తోడు.. ఆర్థిక సమస్యలు వెంటాడాయి. దీంతో సంస్కరణలకు పునాదులు వేసి.. ప్రైవేటీకరణను, ప్రపంచీకరణను తెరమీదకి తెచ్చి.. దేశాన్ని సంస్కరణల పథంలో ముందుకు నడిపించారు. ఐదేళ్లు కూడా.. అనేక సమస్యలు వచ్చినా.. ఆయన వెన్ను చూపకుండా దేశానికి వెన్నుదన్నుగా నిలిచారు. అలాంటి నాయకుడిని కాంగ్రెస్ అప్పట్లోనే వదిలేసుకుంది. నిజమో కాదో.. తెలియదు కానీ.. పీవీ మరణించినప్పుడు.. ఆయన పార్థివ దేహాన్ని న్యూఢిల్లీలోని ఏఐసీసీ ఆఫీస్‌కు తెస్తామని అన్నా.. పార్టీ వద్దన్నదని.. ప్రచారంలో ఉంది. ఇక, అలాంటి పీవీకి ఇప్పుడు భారతరత్న ఇవ్వడం ద్వారా.. పటేల్ మాదిరిగా.. పీవీని కూడా మోదీ సొంతం చేసుకున్నారనడంలో సందేహం లేదు. కాంగ్రెస్ ప్రధానిగా ఈ దేశాన్ని పాలించిన పీవీకి భారతరత్న ఇవ్వడం ద్వారా.. ఇప్పటికిప్పుడు తెలంగాణ లో బీజేపీ పుంజుకుంటుందా.. లేదా.? అనేది పక్కన పెడితే.. దేశవ్యాప్తంగా కాంగ్రెస్‌ను ఎండగట్టేందుకు.. ఏమాత్రమైనా సంపాయించుకుని ఉన్న సింపతీ ఉంటే.. దానిని బదాబదలు చేసేందుకు ప్రధాని నరేంద్ర మోదీ సహా కమలనాథులకు పెద్ద అవకాశం చేతికి చిక్కినట్టేనని భావించవ చ్చు. లేదంటే.. కాంగ్రెస్‌పై మరింత సానుభూతి పెరగకుండా.. కట్టడి చేసేందుకు ఇది అవకావం ఇచ్చేచాన్స్ ఉంది.

## రికార్డు స్థాయికి భారతదేశ విదేశీ మారకద్రవ్య నిల్వలు..!


భారతదేశ విదేశీ మారకద్రవ్య నిలువలు ఈ వారం రికార్డు స్థాయిలో 622.469 బిలియన్లకు పెరిగాయి. ఫిబ్రవరి 2తో ముగిసిన వారంతో పోలిస్తే ఇది 5.736 బిలియన్ డాలర్లు పెరిగింది. రిజర్వ్ బ్యాంక్ వీక్లీ డేటా ప్రకారం.. భారతదేశ విదేశీ మారక నిల్వలలో అతిపెద్ద వాటా విదేశీ కరెన్సీ ఆస్తులు కాగా.. ఇది 5.186 బిలియన్ డాలర్లు పెరిగి 551.331 బిలియన్ డాలర్లకు చేరుకుంది. అలాగే పసిడి నిల్వలు సైతం 680 మిలియన్ డాలర్లు పెరిగి 48బిలియన్ డాలర్లకు చేరాయి. 2021 అక్టోబర్లో భారత విదేశీ మారక నిల్వలు గరిష్ఠ స్థాయి 645 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి.అయితే దిగుమతుల వ్యయం పెరగడంతో 2022లో విదేశీ మారక నిల్వలు గణనీయంగా తగ్గాయి. ఇప్పుడు మరోసారి గరిష్ఠ స్థాయికి చేరుకున్నది. కరెన్సీ మార్కెట్‌లో ఆర్‌బీఐ జోక్యం తర్వాత, విదేశీ కరెన్సీ ఆస్తుల్లో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. దేశంలో తగినన్ని ఫారెక్స్ రిజర్వులు ఉన్నాయని కేంద్ర ప్రభుత్వం చెబుతున్నది. ఏ దేశంలోనైనా విదేశీ మారక నిల్వలు ఎంత భారీగా ఉంటే.. ఆ దేశం ఆర్థికంగా అంత బలంగా ఉండనున్నది. దేశ ఆర్థిక స్థిరత్వంలో ఫారెక్స్ రిజర్వ్ కీలక పాత్ర. విదేశీ మారక నిల్వలు తగ్గుతున్నాయంటే.. ఆర్థిక వ్యవస్థపై పడుతున్న ఒత్తిడిగా దాన్ని గుర్తించాలని ఆర్థిక నిపుణులు పేర్కొంటున్నారు.



## పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌కు ఊరట..

### 12 కేసుల్లో బెయిల్ మంజూరు..!

పాక్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌కు రావల్పిండిలోని ఏటీసీ కోర్టు 12 కేసుల్లో బెయిల్ మంజూరు చేసింది. ఆయనతో పాటు మాజీ విదేశాంగ మంత్రి షా మహమూద్ ఖురేషికి సైతం 13 కేసుల్లో బెయిల్ ఇచ్చింది. ఇమ్రాన్ ఖాన్, షా మెహమూద్ ఖురేషీలకు బెయిల్ సీహెచ్ఈ, ఆర్మీ మ్యూజియం దాడులకు సంబంధించిన కేసుల్లో పూచీకత్తుపై బెయిల్‌ను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఏటీసీ జడ్జి మాలిక్ ఇజాజ్ ఆసిఫ్ బెయిల్‌ను మంజూరు చేశారు.ఇమ్రాన్ ఖాన్‌ను కస్టడీలో ఉంచడంలో అర్థం లేదని.. ఎందుకంటే మే 9న నిందితులందరికీ బెయిల్ మంజూరైందన్నారు. ఇమ్రాన్, ఖురేషీలను ఫిబ్రవరి 6న దోషులుగా నిర్ధారించారు. ఇద్దరినీ కోర్టు ఎదుట హాజరుపరిచారు. మే 9న ఇస్లామాబాద్ హైకోర్టు ఆవరణలో తనను అన్యాయంగా అరెస్టు చేశారని ఇమ్రాన్ ఖాన్ అన్నారు. అవినీతి కేసులో అరెస్ట్ అయిన తర్వాత మే 9న దేశవ్యాప్తంగా చెలరేగిన అల్లర్లకు సంబంధించి ఇమ్రాన్‌పై పలు కేసులు నమోదయ్యాయి. పాకిస్థాన్ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ఇమ్రాన్ ఖాన్‌కు బెయిల్ లభించింది.గురువారం జరిగిన ఎన్నికలకు సంబంధించిన కౌంటింగ్ కొనసాగుతున్నది. పాకిస్తాన్ ముస్లిం లీగ్ అతిపెద్ద పార్టీగా అవతరించింది. సార్వత్రిక ఎన్నికల ఫలితాలు ప్రకటించడంలో జాప్యంపై విమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ఇమ్రాన్ ఖాన్ శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. పాకిస్థాన్ ముస్లిం లీగ్-నవాజ్ (పీఎంఎల్) అధినేత నవాజ్ షరీఫ్ లండన్ ప్లాన్ ఓటింగ్ విఫలమైందని ఆయన అన్నారు. తన మిత్రపక్షాలైన పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ, జమియత్ ఉలేమా-ఎ-ఇస్లాం (ఎఫ్), ముత్తాహిదా క్వామీ మూవ్‌మెంట్ (పాకిస్థాన్)తో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలనుకుంటున్నట్లు ప్రకటించారు.



## లోక్‌సభ ఎన్నికలకు జేపీ నడ్డా దూరం?

భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయడం లేదు. ఆయన తిరిగి రాజ్యసభ ఎంపీ అవుతారని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి.జేపీ నడ్డాను ఉత్తరప్రదేశ్ నుంచి రాజ్యసభకు పంపవచ్చని సమాచారం.జేపీ నడ్డా ఇటీవలే రాజ్యసభ పదవీకాలం పూర్తిచేసుకున్నారు. ప్రస్తుత ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, విదేశాంగ మంత్రి జైశంకర్ కూడా 2024 లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశాలు లేవని బీజేపీ వర్గాలు పేర్కొన్నాయి. రాజ్యసభ ఎంపీలైన నిర్మలా సీతారామన్, ఎస్ జైశంకర్ పదవీకాలం మూడేళ్ల కంటే అధిక సమయం ఉంది. అందుకే వారికి లోక్‌సభ ఎన్నికలలో పోటీ నుండి మినహాయింపు ఉండవచ్చు. కాగా బీజేపీ నేతలు ధర్మేంద్ర ప్రధాన్, భూపేంద్ర యాదవ్, మురళీధరన్‌లు లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయనున్నారు.హిమాచల్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం ఉండటానికి తోడు, అక్కడ బీజేపీ ఎమ్మెల్యేల సంఖ్య తక్కువగా ఉంది. ఈ నేపథ్యంలో నడ్డా తన సొంత రాష్ట్రం హిమాచల్ ప్రదేశ్ నుండి రాజ్యసభకు వెళ్లే అవకాశాలు తక్కువగా కనిపిస్తున్నాయి. అయితే ఉత్తరప్రదేశ్ నుంచి జేపీ నడ్డా రాజ్యసభకు వెళ్లే అవకాశాలున్నాయనే మాట కూడా వినిపిస్తోంది. ఎన్నికల సంఘం ఇటీవల ఫిబ్రవరి 27న 56 రాజ్యసభ స్థానాలకు ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదల చేసింది.



## నితీష్.. నాయుడు.. ఒకే బాట




పాట్నా, ఫిబ్రవరి 10, (న్యూస్ పల్స్) బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ కు, ఏపీ మాజీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు కు రాజకీయంగా పోలికలు ఉన్నాయి. ఒకరిది బీహార్.. మరొకరిది ఆంధ్రప్రదేశ్ .. అయినా ఇద్దరి ఆలోచనలు ఒక్కటే. ఎత్తుగడలూ అంతే. అందుకే వీరిద్దరూ సుదీర్ఘకాలంగా రాజకీయాల్లో మనగలుగుతున్నారు. రాజకీయాల్లో పొత్తులు పెట్టుకోవడం సహజమే. అయితే తమ పదవులను కాపాడుకోవడం కోసం, అధికారంలోకి రావడం కోసం పొత్తులను వీళ్లిద్దరూ మార్చినట్లు దేశ రాజకీయ నేతల్లో ఎవరూ చేయలేదు. బీహార్ రాజకీయాలు హాట్ హాట్ సాగుతున్న వేళ ఇప్పుడు నెట్టింట ఈ చర్చ జరుగుతుంది. ఇద్దరూ రాజకీయంగా ఎలా ఎదిగిందీ గుర్తు చేసుకుంటూ పోల్చుకుంటున్నారు. . నితీష్ కుమార్ కూడా పార్టీ నేత శరద్ యాదవ్ ను పక్కన పెట్టి జేడీయూను సొంతం చేసుకున్నారు. తాను చీఫ్ గా మారారు. చంద్రబాబు కూడా 1995లో తన మామ, పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్ ను పక్కన పెట్టి తెలుగుదేశం పార్టీకి తాను చీఫ అయ్యారు. ముఖ్యమంత్రి పదవి కూడా దక్కించుకున్నారు. ఇద్దరూ జాతీయ రాజకీయాల్లో పేరొందిన వారే. నితీష్ కుమార్ బీహార్ కే పరిమితమయి రాజకీయాలు చేస్తూ ఎనిమిది సార్లు ముఖ్యమంత్రి పదవి చేపట్టారు. ఇప్పుడు తొమ్మిదో సారి ముఖ్యమంత్రిగా మరోసారి ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఇద్దరూ రాజకీయ పరిణామాలను అంచనాలు వేసి తమ వ్యూహాలను మార్చుకోవడంలో దిట్ట. కూటములను మార్చి... నితీష్ కుమార్ అనేకసార్లు కూటములను మార్చారు. ఒకసారి ఎన్డీఏ అంటారు. మరొకసారి యూపీఏ అంటారు. అటు బీజేపీతో చేతులు కలుపుతారు. ఇటు కాంగ్రెస్ తో దోస్తీ కడతారు. అలా చేసినా ఆయన తన ముఖ్యమంత్రి పదవిని మాత్రం కాపాడుకుంటూనే ఉంటారు. ఎప్పుడూ అంతే. నితీష్ కుమార్ అవసరం వారికి ఉంటుంది. బీహార్ లో బలమైన ప్రాంతీయ పార్టీ కావడంతో నితీష్ ఎప్పుడు వచ్చినా అటు కాంగ్రెస్ కానీ, ఇటు బీజేపీ కానీ అభ్యంతరం చెప్పవు. ఎందుకంటే నితీష్ అవసరంతోనే అక్కడ అధికారంలోకి రావాల్సి ఉంటుంది. గత ఎన్నికలలో బీహార్ లో అతి పెద్ద పార్టీగా ఎక్కువ స్థానాలతో ఆర్‌జేడీ అవతరించినప్పటికీ సీఎం కుర్చీని మాత్రం నితీష్ కే అప్పగించాల్సి వచ్చింది. చంద్రబాబు కూడా అంతే. కూటములను మార్చడం అనేకన్నా. ఎక్కువ సార్లు బీజేపీతో ఒకసారి కాంగ్రెస్ తో జత కట్టారు. బీజేపీ వేవ్ ఉన్నప్పుడు ఆయన బీజేపీతో జతకట్టి అధికారంలోకి రాగలిగారు. 2018 ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ తో కలసి మహాకూటమిలో టీడీపీని భాగస్వామిగా చేయగలిగారు. 2014 ఎన్నికల్లో బీజేపీతో పొత్తు పెట్టుకున్న చంద్రబాబు కేంద్ర ప్రభుత్వంలోనూ భాగస్వామిగా మారారు. రాష్ట్రంలో బీజేపీ నేతలను తన కేబినెట్ లోకి తీసుకున్నారు. అయితే ఎన్నికలు ఏడాది ఉన్న సమయంలో బీజేపీకి రాం రాం చెప్పేశారు. 2019 ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసి చేయి కాల్చుకున్న చంద్రబాబు మరోసారి బీజేపీ తో పొత్తుతో 2024 ఎన్నికలకు వెళదామనుకుంటున్నారు. నితీష్.. నారా వారి రాజకీయ నడక ఒకేమాదిరిగా సాగుతుందన్న సెటైర్లు సోషల్ మీడియాలో వినిపిస్తున్నాయి.

## ఒక రేషన్ కార్డు.. ఒక మీటర్.. ఒక కుటుంబం..

హైదరాబాద్, ఫిబ్రవరి 10 అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు తెలంగాణలో పేద, మధ్య తరగతి కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించేందుకు కసరత్తు చేస్తోంది. ఈనెలలోనే పథకం అమలు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత ఉచిత విద్యుత్ హామీ అమలు చేస్తారని తెలుస్తోంది. ఈ క్రమంలో ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. అయితే ఇందులో ఉచిత విద్యుత్ పొందేందుకు కొన్ని షరతులు పెట్టింది. తెల్ల రేషన్‌కార్డును తప్పనిసరి చేసింది. ప్రతినెలా 200 యూనిట్లకన్నా తక్కువ విద్యుత్ వాడే వారికి ఈ ప్రయోజనం లభిస్తుంది. ఒకటికంటే ఎక్కువ మీటర్లు ఉన్నవారికి ఇది వర్తించదు. అద్దె ఇళ్లలో ఉంటున్నవారు కూడా ఉచిత విద్యుత్ పథకానికి అర్హులే. హైదరాబాద్ వంటి నగరాల్లో అద్దె చెల్లించి నివసించే వారు, ప్రసస్తుతం ఉంటున్న మీటరు నంబర్‌తో, రేషనకార్డు, ఆధార్ కార్డు జతచేయాల్సి ఉంటుంది. ఏ ప్రాంతంలో కూడా ఇక దరఖాస్తు చేసి ఉండకూడదు. సొంత గ్రామంలో ఇల్లు ఉండి హైదరాబాద్‌లో అద్దెకు ఉంటున్నవారు ఏదో ఒక్కచోట మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. రెండుచోట్ల లబ్ధి పొందడం కుదరదు.ఒక్క రేషన్ కార్డుతో ఒక్క కుటుంబానికి మాత్రమే లబ్ధి చేకూరుతుంది.

## కొత్త ఆధ్యాత్మిక యుగంలోకి ప్రవేశించాం: ఎంపీ బీబీ పాటిల్




న్యూఢిల్లీ: అయోధ్య రామమందిరం నిర్మాణంతో మనం కొత్త ఆధ్యాత్మిక యుగంలోకి ప్రవేశించామని బీఆర్ఎస్ ఎంపీ బీమ్‌రావ్ బసంత్‌రావు పాటిల్‌అన్నారు. దేశం ఆధ్యాత్మిక పథంలో నడుస్తోందన్నారు. లోక్‌సభలో ఆయన ఇవాళ మాట్లాడుతూ.. జనవరి 22వ తేదీన అయోధ్య రామాలయంలో రామ్‌లల్లా ప్రాణప్రతిష్ట సందర్భంగా దేశమంతా సంబరం జరుపుకుందన్నారు. హిందువులు ఆ ఆలయాన్ని మహత్వపూర్ణంగా భావిస్తామన్నారు. అయోధ్య రామమందిరం ప్రముఖ ధార్మిక, ఆధ్యాత్మిక కేంద్రంగా ఎదగనున్నట్లు ఆయన చెప్పారు. భారత ఇతిహాసంలో 22 జనవరివ తేదీ మరో అధ్యాయాన్ని జోడించిందన్నారు.అయోధ్యను రాముడి జన్మస్థానంగా భావిస్తామని ఎంపీ పాటిల్ పేర్కొన్నారు.. నగర శైలిలో అయోధ్య ఆలయాన్ని నిర్మించారన్నారు. ఇక అయోధ్య పెద్ద సంఖ్యలో పర్యాటకులను ఆకర్షిస్తుందని, స్థానికులకు ప్రతి రోజు ఆదాయం దొరుకుతుందన్నారు. ప్రాచీన, ఆధునిక కళల మేళవింపులో రామ మందిరం నిర్మించారన్నారు. ఆ రాష్ట్ర ఆర్థిక వృద్ధి కూడా జరుగుతుందన్నారు.జహీరాబాద్‌లో కూడా ఎన్నో ఆలయాలు ఉన్నాయని, ప్రాచీన మందిరాలు ఉన్నాయని, వాటి అభివృద్ధి కోసం తమ నియోజకవర్గానికి ఆర్థిక సహకారం అందించాలని ఎంపీ బీబీ పాటిల్ కేంద్రాన్ని కోరారు. ఆలయాలను అభివృద్ధి చేయడం వల్ల తెలంగాణ రాష్ట్ర ఆర్థిక స్థితి కూడా మెరుగవుతుందన్నారు. పెద్ద సంఖ్యలో పర్యాటకులు వస్తారని, స్థానికులకు రోజువారీ ఆదాయం వస్తుందన్నారు.

## రూ.2,75,891 కోట్లతో ఓటాన్ అకౌంట్ బడ్జెట్

మెదటిపేజీ తరువాయి...

నిధులు అందిస్తాం అన్నారు. గృహజ్యోతి ద్వారా అర్హులందరికీ 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తామని, త్వరలో రూ.500కే గ్యాస్ సిలిండర్ అందిస్తాం అన్నారు. వోస్ పర్యటన ద్వారా రాష్ట్రానికి రూ.40 వేల కోట్ల పెట్టుబడులు రానున్నాయన్నారు. పీఎం మిత్ర నిధులతో కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు మరింత అభివృద్ధి చేస్తామని అన్నారు. ప్రభుత్వం నుంచి 2 లెదర్ పార్కులు, రాష్ట్రం నలుమూలలా ఫార్మా క్లస్టర్లు ఏర్పాటు చేస్తాం అన్నారు. డ్రై పోర్టులను అందుబాటులోకి తెచ్చేందుకు బృహత్ ప్రణాళిక అమలు చేస్తామని ప్రకటించారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృత్రిమ మేధ ఉపయోగిస్తాం. ఐటీ రంగంలో నైపుణ్యాభివృద్ధికి నూతన పాలసీ తీసుకుని వస్తాం. రాష్ట్ర నలుమూలలకు విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని అన్నారు. ఐటీ విస్తరణకు అమెరికాలోని ఐటీ సర్వ్ సంస్థతో సంప్రదింపులు చేస్తున్నామని అన్నారు. దేశంలోనే అత్యంత పటిష్ఠమైన ఫైబర్ నెట్‌వర్క్ కనెక్షన్లు ఉండేలా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతాం అన్నారు. బడ్జెట్ కేటాయింపులు ఇలా.. ఉన్నాయి. ఆరు గ్యారంటీలకు రూ.53,196 కోట్లు,వ్యవసాయానికి రూ.19.746 కోట్లు, ఐటీ శాఖకు రూ.774 కోట్లు, పురపాలక శాఖకు రూ.11,692 కోట్లు,విద్యా రంగానికి రూ.21,389 కోట్లు,మూసీ ప్రాజెక్టుకు రూ.1,000 కోట్లు,వైద్య రంగానికి రూ.11,500 కోట్లు,ఎస్సీ సంక్షేమ శాఖకు రూ.21,874 కోట్లు,గృహ నిర్మాణ రంగానికి రూ.7,740 కోట్లు,మైనారిటీ సంక్షేమ శాఖకు రూ.2,262 కోట్లు,ఎస్సీ, ఎస్టీ గురుకుల భవన నిర్మాణాల కోసం రూ.1250 కోట్లు,ఎస్సీ సంక్షేమానికి రూ.21874 కోట్లుఎస్టీ సంక్షేమానికి రూ.13013 కోట్లు,మైనార్టీ సంక్షేమానికి రూ.2262 కోట్లు,బీసీ సంక్షేమం, బీసీ గురుకుల భవనాల నిర్మాణం కోసం రూ.1546 కోట్లు, బీసీ సంక్షేమానికి రూ.8 వేల కోట్లు,విద్యా రంగానికి రూ.21389 కోట్లు, తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటుకు రూ.500 కోట్లు,యూనివర్సిటీల్లో సదుపాయాలకు రూ.500 కోట్లువైద్య రంగానికి రూ.11500 కోట్లు,విద్యుత్ – గృహ జ్యోతికి రూ.2418కోట్లు, విద్యుత్ సంస్థలకు రూ.16825 కోట్లు, గృహ నిర్మాణానికి రూ.7740 కోట్లు,నీటి పారుదల శాఖకు రూ.28024 కోట్లు కేటాయించారు.ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించిన విధంగా ఇక నుంచి నంది అవార్డును గద్దర్ అవార్ పేరుతో చిత్ర, టీవీ కళాకారులకు అందచేయనున్నామన్నారు. ప్రజా యుద్ధనౌక గద్దర్ కు ఇదే తాము ఇచ్చే నివేళి అన్నారు. గద్దర్ను గౌరవించడం అంటే తెలంగాణ సంస్కృతిని, ప్రగతిల భావజాలంతో సమాజాన్ని చైతన్య పరిచే ప్రజా కవులు, ప్రజా గాయకులను గౌరవించడమే అన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలను పరిరక్షించడం మా ప్రభుత్వ ప్రథమ కర్తవ్యం అన్నారు భట్టి. శాంతి భద్రతలు అదుపులో ఉంటేనే ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలు నిరాటకంగా అందించ్ అవకాశం ఉంటుంది. గత ఐదేళ్లు సంవత్సరాలుగా రాష్ట్రంలో మాదక ద్రవ్యాలు వినియోగం ఎక్కువైందజి.

## నల్గొండ దద్దరిల్లేలా కేసీఆర్ సభ: జగదీష్‌రెడ్డి

నల్గొండ: నల్గొండ దద్దరిల్లేలా ఈ నెల 13న బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ సభ ఉంటుందని మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి తెలిపారు. కృష్ణా జలాల సాధాన కోసం బీఆర్ఎస్ నల్గొండలో నిర్వహిస్తున్న చలో నల్గొండ సభ ఏర్పాట్లను జగదీష్‌రెడ్డి శనివారం పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ సభకు కేసీఆర్ స్వయంగా హాజరై కృష్ణా ప్రాజెక్టులపై కాంగ్రెస్ నిర్వాకాన్ని ఎండగడతారని చెప్పారు.'సీఎం రేవంత్‌రెడ్డి ఆఫ్ నాలెడ్జ్ వ్యక్తి. కేసీఆర్ గుర్తులు చెరిపేస్తామంటున్న రేవంత్‌రెడ్డిది నీచ సంస్కృతి. ఇవాళ దొంగల చేతికి తెలంగాణ పోయింది. కృష్ణా ప్రాజెక్టులను తిరిగి రాష్ట్ర పరిధిలోకి తీసుకురాకుంటే కాంగ్రెస్ వాళ్ళను గ్రామాల్లో తిరగనివ్వం' అని జగదీష్‌రెడ్డి హెచ్చరించారు.తెలంగాణలో కృష్ణా నదిపై ఉన్న ప్రాజెక్టులను కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రం ఆధీనంలో కేఆర్ఎంబీకి అప్పగించిందని బీఆర్ఎస్ ఆరోపిస్తున్న విషయం తెలిసిందే. ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ చలో నల్గొండ పేరుతో బీఆర్ఎస్ నల్గొండలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తోంది.



## పాతకక్షలతో యువకుని పై కత్తితో దాడి



బాల్కొండ నియోజకవర్గం ప్రతినిధి, ఫిబ్రవరి 10( లోకం తీరు):బాల్కొండ :మండల కేంద్రంలోని వన్నెల్ బి చౌరస్తా వద్దగల బ్రహ్మేశ్వర టి స్టాల్ లో శనివారం సయ్యద్ రఫీక్ టీ త్రాగుతుండగ సయ్యద్ సోఫియన్ వయస్సు 25సం, సయ్యద్ రిహాన్ వయస్సు 28సం రాలు వీరు ఇద్దరు అన్నదమ్ములు కలిసి కత్తితో అతనిపై దాడి చేయగా రఫీక్, అతారుద్దీన్ లకు చెవులకు మరియు ఇతర చోట్ల రక్త గాయాలు అయినట్లు ఎస్సై గోపి అన్నారు. ఇట్టి ఘటనపై కేసు నమోదు చేసి నిందితులను జ్యుడీషియల్ రిమాండ్ కు పంపినామని అన్నారు.

## దామాషా ప్రకారం బీసీలకు బడ్జెట్ కేటాయించాలి



నిజామాబాద్,ఫిబ్రవరి10,(లోకంతీరు):జనాభా దామాషా ప్రకారం బీసీలకు బడ్జెట్ కేటాయించాలి అని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కెంపుల నాగరాజు అన్నారు. బీసీలలో కుల వృత్తులను నమ్ముకునే జీవనాధారం కొనసాగిస్తు ఉపాధి కల్పనకు, ఆర్థిక, సామాజిక పరిస్థితుల మెరుగుదలకు కులవృత్తులను ఆధునీకరించావలసిన అవశ్యకత ఉంది అని, లేదంటే బీసీలు వెనుకబాటుకు గురవడం ఖాయం అని అన్నారు. ఈ పరిస్థితుల్లో 56శాతం జనాభా కలిగిన బీసీలకు, రూ. 8వేల కోట్ల బడ్జెట్ కేటాయించడం చాలా తక్కువ అని, జనాభా దామాషా ప్రకారం రూ.56 వేల కోట్ల బడ్జెట్ కేటాయిస్తేనే, బీసీలకు న్యాయం జరుగుతుందని, బీసీ సబ్ ప్లాన్ అమలుతో లబ్ది చేకూరుతుందని, కొత్తగా బీసీ కార్పొరేషన్ల ఏర్పాటు జరుగుతుందని, అప్పుడే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, సంక్షేమ పథకాల అమలు సవ్యంగా సాగుతుందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ఈ దిశగా ఆలోచించి, బీసీలకు న్యాయం చేయాలని కోరారు

## బాల్కొండ మండల కేంద్రంలో విద్యార్థులకు అవగాహన కల్పించిన బాల్కొండ పోలీసులు




బాల్కొండ నియోజకవర్గం ప్రతినిధి ,ఫిబ్రవరి 10( లోకం తీరు): బాల్కొండ మండల కేంద్రంలోని పాఠశాల విద్యార్థులకు పోలీసులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ పిల్లలను ఎత్తుకెళున్నారని వస్తున్న వార్తల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు సూచించామన్నారు. అవసరమైన జాగ్రత్తలు పాటించాలన్నారు. అనుమానితులు కనిపిస్తే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బాల్కొండ ఏఎస్సై శంకర్ బాల్కొండ పోలీస్ సిబ్బంది మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శంకర్, ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ మరమ్మత్తులు వెంటనే చేపట్టాలి



కామారెడ్డి జిల్లా సదాశివనగర్(ఫిబ్రవరి 10 లోకం తీరు)సదాశివనగర్ మండల కేంద్రంలోని భూంపల్లి గ్రామంలో పదో వార్డులో ఏళ్ల తరబడి ఉన్న ఇళ్లపై ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ తీగలు. ఏంమాత్రం కనురెప్ప సమయంలో ఏదైనా ప్రమాదం జరగవచ్చు విద్యుత్ అధికారుల పై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.ఏళ్ల తరబడిగా ఇబ్బందుల్లో కాలని వాసులు ఎప్పుడు ఏం జరుగుతుందో అని ఏళ్ల తరబడి ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ఉంటున్నారు. అదేవిధంగా ఎనిమిదవ వార్డ్ లో కూడా ఇళ్లపై విద్యుత్ తీగలు వేలాడుతూ ఉంటున్నాయి విద్యుత్ తీగలు స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నాయి అధికారులు పట్టించుకోవడం లేదని పదో వార్డ్ ప్రజలు ఆగ్రహంవ్యక్తం చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో గత్యంతరం లేక కర్రలను పాతి కిందికి వేలాడుతున్న వైర్లకు సపోర్టుగా ఉంచుతున్నారు. గ్రామాల్లో కిందికి వేలాడుతున్న కరెంటు తీగలను వంగిన స్తంభాలను సరి చేయాలి కానీ అధికారులు తమకేం పట్టనట్టు వ్యవహరిస్తున్నారు కొన్ని చోట్ల మాత్రం మరమ్మత్తులు చేపట్టుతున్నారు గ్రామ ప్రజలు ఇళ్లపై వేలాడుతున్న విద్యుత్ తీగలు ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి గ్రామంలో ఉన్న స్తంభాలను తీగలను సరిచేయాలని గ్రామస్తులు కోరుకుంటున్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం పేర్లు మార్చుతుందే కానీ ప్రగతి గేర్లను మార్చడం లేదు...

**ఇది నేమ్ చేంజింగ్ ప్రభుత్వం... గేమ్ చేజింగ్ ప్రభుత్వం కాదు..**
**ఇచ్చిన హామీల అమలుకు నిధులు కేటాయించని కాంగ్రెస్ ప్రభుత్వం...**
**గత ప్రభుత్వాన్ని విమర్శించడానికే బడ్జెట్ పరిమితమైంది..**
**పాత పెన్షన్లకు ఇక కొత్త ప్రభుత్వం ఎందుకు ?**
**కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధిని నిరూపించుకోలేకపోయింది..**
**బడ్జెట్ పై స్పందించిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత..**

హైదరాబాద్ ఫిబ్రవరి 10(లోకంతీరు) : కాంగ్రెస్ ప్రభుత్వం పాత పేర్లను మార్చి కొత్త పేర్లు పెడుతామని అంటున్నది తప్ప ప్రగతి గేర్లను మార్చడం లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. ఇది కేవలం నేమ్ చేంజింగ్ గవర్నమెంటే కానీ గేమ్ చేజింగ్ గవర్నమెంట్ కాదన్న విషయం ఈ బడ్జెట్ ను చూస్తే అర్థమవుతుతోందని తేల్చిచెప్పారు. కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ పేరిట ఆడబిడ్డల వివాహాలకు కేసీఆర్ ప్రభుత్వం రూ. లక్ష చొప్పున అందించేదని, దానికి అదనంగా తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని, కానీ దానికి నిధులు కేటాయించకపోవడమే కాకుండా కనీసం బడ్జెట్ లో ప్రస్తావించలేదని ఎండగట్టారు. ఆశా వర్కర్ల జీతాలను రూ. 18 వేలకు పెంచి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, దాన్ని కూడా బడ్జెట్




లో ప్రస్తావించకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వం తన చిత్తశుద్ధిని బడ్జెట్ ద్వారా నిరూపించుకోలేకపోయిందని ధ్వజమెత్తారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం కేటాయింపులు చేయకుండా కేవలం గత ప్రభుత్వాన్ని విమర్శించడానికే బడ్జెట్ పరిమితమైందని అన్నారు. శనివారం నాడు శాసన మండలి ఆవరణలో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ తో కలిసి ఎమ్మెల్సీ కవిత మీడియాతో మాట్లాడారు. మధ్యంతర బడ్జెట్ లో ప్రజలు చాలా ఆశించారని, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలుకు దారి చూపిస్తుందని భావించామని తెలిపారు. కానీ మధ్యంతర బడ్జెట్ తీవ్రంగా నిరాశపరిచిందని స్పష్టం చేశారు. కేటాయింపులు ముఖ్యం కాదని, ప్రభుత్వ దృక్పథం బడ్జెట్ ను సూచిస్తున్నదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో పేర్కొన్న అంశాలకు బడ్జెట్ లో కేటాయింపులు చేయలేదని స్పష్టం చేశారు. మైనారిటీ సంక్షేమానికి సంబంధించి ప్రభుత్వం చాలా మాటలు మాట్లాడిందని, ఇమామ్‌లకు, మోజమ్లకు రూ. 10 వేలు ఇస్తామని, పిల్లల కోసం తౌఫే తాలిమ్ ను మొదలుపెడుతామని కాంగ్రెస్ పార్టీ తన మ్యానిఫెస్టోలో చేర్చి బడ్జెట్ లో విస్మరించిందని విమర్శించారు. మైనారిటీ సంక్షేమానికి కేవలం రూ. 2 వేల కోట్లు మాత్రమే కేటాయించడమేంటని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో చెప్పిన సూక్ష్మ స్థాయి హామీల అమలు ప్రస్తావన బడ్జెట్ లో లేకపోవడం ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని స్పష్టమవుతోందని తెలిపారు. పేర్లు, చిహ్నాలు మార్చడానికి ఇచ్చిన ప్రాధాన్యత హామీల అమలుకు కేటాయింపులు చేపట్టడానికి ప్రభుత్వం ఇవ్వలేదని మండిపడ్డారు. కాగా, కేసీఆర్ హయాంలో ఒక్క నిమిషం కూడా విద్యుత్తు కోత లేకపోయేదని, కానీ ఇప్పుడు హైదరాబాద్ పట్టణంలోనే ప్రతి రోజూ 3-4 గంటల పాటు కరెంటు పోతుందని విమర్శించారు.

# దళిత అమ్మాయి ఘటన పై ఎస్సీ,ఎస్టీ కమిషనర్ రాక : కమిషనర్ వెంకటయ్య

కామారెడ్డి జిల్లా ప్రతినిధి (ఫిబ్రవరి 10 లోకం తీరు)కామారెడ్డి జిల్లా ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ కు ఎస్సీ ఎస్టీ కమిషనర్ అండ్ చైర్మన్ శనివారం కామారెడ్డికి రావడం జరిగింది. భకి వెంకటయ్య, కామారెడ్డి జిల్లా డి.ఎస్.పి ప్రకాశ్ ,సీఐ రమణ తో కలిసి మాట్లాడారు. దళిత అమ్మాయికి జరిగిన ఘటనపై అమ్మాయికి న్యాయం జరగాలని సదుద్దేశంతో దళిత సంఘా నాయకులు దారుణాన్ని దృష్టిలో పెట్టుకొని న్యాయం చేయగలరని, పరార్ లో ఉన్న ఇంకా ఇద్దరినీ బైండోవర్ చేయాలి. లేనిచో అన్ని సంఘాలు ఏకమై పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరిస్తున్నాం అంబేద్కర్ జిల్లా అధ్యక్షులు ఆకుల బాబు, మాదిగ రాజకీయ పోరాట సమితి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆరు బాగయ్య, మాదిగ నాయకులు బీఎస్పీ పార్టీ సీనియర్ నాయకులు ఎర్ర శివరాజ్, రాష్ట్ర బీఎస్పీ పార్టీ ఈసీ మెంబర్ బట్టన్ కి బాలరాజు, బీఎస్పీ పార్టీ జిల్లా అధ్యక్షులు హరిలాల్ నాయక్, అంబేద్కర్ సంఘం గౌరవ అధ్యక్షులు కొత్తపల్లి మల్లయ్య, ఉపాధ్యాయ జిల్లా అధ్యక్షులు యాదయ్య, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు బట్టి వెంకటరాములు,



ఎమ్మార్పీఎస్ మహిళా జిల్లా అధ్యక్షురాలు లక్ష్మి మాదిగ, రాజకీయ పోరాట సమితి యూత్ అధ్యక్షులు కోటి అశోక్, కొత్తూరు గంగయ్య, అరుణ, లతా, లలిత, విద్యార్థుల జిల్లా అధ్యక్షులు విట్టల్, ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థుల సంఘాలు, అంబేద్కర్ సంఘాలు, ఎమ్మార్పీఎస్ సంఘాలు, దళిత సంఘాలు, పాల్గొన్నారు. దళిత అమ్మాయి శ్యామల ను అవమానపరంగా జరిగిన



దారుణాని ఖండిస్తూ బాధితురాలికి న్యాయం జరగాలని, జిల్లాలో ఇలాంటి సంఘటనలు కాకుండా ఉండాలని హెచ్చరిస్తున్నాము అని అన్నారు.కామారెడ్డి జిల్లా ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో ప్రెస్ మీట్ లో మాట్లాడారు.బాధిత మహిళలకు కలిసి భరోసా ఇస్తూ ధైర్యం చెప్పడం జరిగింది. లేనిచో పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని అన్నారు.

# 15వ ఆర్థిక సంఘం నిధుల సమీక్ష సమావేశం- జడ్పీ చైర్పర్సన్ శోభా




కామారెడ్డి జిల్లా ప్రతినిధి (ఫిబ్రవరి 10 లోకం తీరు)వచ్చే ఆర్థిక సంవత్సరంలో 15 వ ఆర్థిక సంఘం నిధుల క్రింద చేపట్టవలసిన పనులపై రూపొందించిన ఆర్థిక ప్రణాలికను సభ ఏకగ్రీవంగా తీర్మానించిందని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ధఫెదర్ శోభ అన్నారు. శనివారం కలెక్టర్ లోని ప్రధాన సమావేశ మందిరంలో 2024-25 సంవత్సరంలో 15 ఆర్థిక సంఘం క్రింద వచ్చిన 2 కోట్ల 90 లక్షల 4 వేల తో చేపట్టవలసిన పనులపై జిల్లా పరిషద్ ప్రత్యేక సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఇట్టి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, జిల్లా పరిషద్ వైస్ చైర్మన్ ప్రేమ్ కుమార్, జెడ్పి ముఖ్య కార్యనిర్వహణాధికారి సాయ గౌడ్, జెడ్.పి .టి.సి . సభ్యులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భముగా శోభ మాట్లాడుతూ 15వ



ఆర్థిక సంఘం నిధులలో 60 శాతం టైడ్ గ్రాంట్ గా కోటి 74 లక్షల 2 వేలతో పారిశుద్యం, మంచినీటి పనులు చేపట్టుటకు సభ తీర్మానించిందని అన్నారు. అదేవిధంగా 40 శాతం అన్ -టైడ్ గ్రాంట్ క్రింద కోటి 16 లక్షల 2 వేల రూపాయలతో పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, ఆరోగ్య ఉప కేంద్రాలు, గ్రంథాలయాలు, శౌచాలయాలు, కిచెన్ షెడ్లు, ఆర్.ఓ. ప్లాంట్లు, సి.సి. రోడ్ల వంటి పనులు చేపట్టుటకు జిల్లా పరిషద్ వైస్ చైర్మన్ ప్రేమ్ కుమార్ ప్రతిపాదిస్తూ తీర్మానము ప్రవేశ పెట్టగా సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారని అన్నారు.

## బాలుడి ఊపిరితిత్తుల్లో సూది.. వినూత్న ప్రక్రియ ద్వారా తొలగించిన వైద్యులు




భువనేశ్వర్: బాలుడి ఊపిరితిత్తుల్లో సూది ఉన్నట్లు డాక్టర్లు గుర్తించారు. ) అయితే ఓపెన్ సర్జరీతో పని లేకుండా వినూత్న వైద్య ప్రక్రియ ద్వారా ఆ సూదిని తొలగించారు. ఆ చిన్నారి ప్రాణాలు కాపాడారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన తొమ్మిదేళ్ల బాలుడి ఎడమ ఊపిరితిత్తు దిగువన ఉన్న బ్రోంకస్ పార్శ్వ భాగంలో సుమారు 4 సెంటీమీటర్ల పొడవైన కుట్టు సూదిని ఎక్స్‌రే ద్వారా డాక్టర్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లోని ఎయిమ్స్ ఆసుపత్రిలో ఆ బాలుడ్ని అడ్మిట్ చేశారు.కాగా, ఆ బాలుడి ఉపిరితిత్తులో ఉన్న సూదిని తొలగించేందుకు భువనేశ్వర్ ఎయిమ్స్‌లోని పిల్లల నిపుణుల బృందం ఓపెన్ సర్జరీతో పని లేకుండా వినూత్న పద్ధతిలో ప్రయత్నించింది. డాక్టర్ రశ్మీ రంజన్ దాస్, డాక్టర్ కృష్ణ ఎం గుల్లా, డాక్టర్ కేతన్, డాక్టర్ రామకృష్ణ కలిసి బ్రోంకోస్కోపిక్ ద్వారా చాలా నైపుణ్యంగా ఆ కుట్టు సూదిని బయటకు తీశారు. ఆ బాలుడికి ప్రాణాపాయం తప్పిందని, కోలుకుంటున్నాడని డాక్టర్లు తెలిపారు.మరోవైపు వినూత్న ప్రక్రియ ద్వారా బాలుడి ఊపిరితిత్తులోని సూదిని తొలగించిన పిల్లల డాక్టర్ల బృందాన్ని భువనేశ్వర్ ఎయిమ్స్ ఆసుపత్రి ఉన్నతాధికారులతోపాటు అంతా అభినందించారు. గాలి మార్గంలో పదునైన వస్తువును తొలగించేందుకు ఫ్లెక్సిబుల్ బ్రోంకోస్కోపీని వినియోగించినట్లు భువనేశ్వర్ ఎయిమ్స్ తెలిపింది. ఇలాంటి వైద్య విధానం తమ ఆసుపత్రితోపాటు దేశంలోని కొన్ని వైద్య కేంద్రాల్లో మాత్రమే అందుబాటులో ఉందని పేర్కొంది.

# రాజకీయ దురుద్దేశంతో హైదరాబాద్ అభివృద్ధిని అడ్డుకుంటున్నారు: కెటిఆర్

హైదరాబాద్, ఫిబ్రవరి 10, ప్రతి ఒక్క కార్పొరేటర్, పార్టీ శ్రేణులు చేసిన కృషి వల్లనే ఈరోజు హైదరాబాద్ నగరంలో బీఆర్ఎస్ పార్టీ క్లీన్ స్వీప్ చేయగలిగిందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ అన్నారు. శనివారం తెలంగాణ భవన్ లో జీహెచ్ఎంసీ పరిధిలోని పార్టీ కార్పొరేటర్లతో కేటీఆర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పది సంవత్సరాలలో ప్రతిరోజు పార్టీ కార్పొరేటర్లు ప్రజల్లో నిలబడి మరీ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసేలా చూశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రాజకీయ దురుద్దేశాలతో నగర అభివృద్ధిని అడ్డుకునే ప్రయత్నం చేస్తుందని.. జీహెచ్ఎంసీ పాలకవర్గం బాధ్యతలను నిర్వహించడంలో ఇబ్బందులకు గురిచేస్తుందని కెటిఆర్ మండిపడ్డారు.ప్రజా పాలన అని చెబుతున్న కాంగ్రెస్ పార్టీ జీహెచ్ఎంసీ జనరల్ బాడీ సమావేశం జరగకుండా, స్టాండింగ్ కౌన్సిల్ ఎన్నికలు కాకుండా ఆపుతుందని.. రాజ్యాంగం ఏర్పాటు చేసిన ఐదు అంచెల పరిపాలన వ్యవస్థలో భాగంగా ఏర్పాటైన స్థానిక ప్రభుత్వం జీహెచ్ఎంసీ అనే విషయాన్ని గుర్తుంచుకోవాలని ఆయన చెప్పారు. జీహెచ్ఎంసీ చట్టం ప్రకారం ఉన్న విస్తృత అధికారాలను ఉపయోగించుకుని..ప్రభుత్వం పెడుతున్న ఇబ్బందులను ఎదుర్కొనే ప్రయత్నం చేయాలన్నారు. 60 రోజుల కాంగ్రెస్ పార్టీ పరిపాలన అయోమయంగా ఉందని? కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6 గ్యారంటీలలో ఉన్న 13 కార్యక్రమాలతో పాటు ఇచ్చిన.. 420 హామీలకు అమలుకు రూ.57 వేల కోట్లు మాత్రమే



బడ్జెట్ లో కేటాయించిందన్నారు. మహాలక్ష్మి పథకం కోసం దరఖాస్తు చేసుకున్న మహిళా సోదరీమణులకు ఇవ్వాల్సిన మొత్తమే రూ.50వేల కోట్ల పైగా అవుతుందని.. మరి రైతుబంధు, ఆసరా, రుణమాఫీ వంటి పథకాల అమలుకు ఎక్కడి నుంచి నిధులు తెస్తారో బడ్జెట్లో చెప్పలేదన్నారు. ఫార్మాసిటీ, మెట్రో విస్తరణ వంటి భారీ ప్రాజెక్టులను రద్దు చేయడం వలన రాష్ట్ర అభివృద్ధి కూడా దెబ్బతినే అవకాశం ఉందని చెప్పారు. అభివృద్ధి దెబ్బతింటే, రాష్ట్రానికి రాబడి, రెవెన్యూ తగ్గే ప్రమాదం ఉందని.. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల అమలుపైన దృష్టి పెట్టకుండా, కేవలం ప్రజలను తప్పు దోవ పట్టించే అటెన్షన్ డైవర్షన్ ప్రయత్నాలను ప్రజలు ఎక్కువ రోజులు నమ్మరని కెటిఆర్ అన్నారు.

## మాఘమాసం... మంచి తరుణం ।

తిరుమల,ఫిబ్రవరి10 : మాఘం...శుభ ముహూర్తాల మాసం. అందుకే అందరూ ఈ మాసం కోసం వేయి కళ్లతో ఎదురుచూస్తుంటారు.వివాహం... ప్రతి ఒక్కరి జీవితంలో అపురూపమైన వేడుక. అందుకే కలకాలం గుర్తుండిపోయేలా చేసుకోవాలని అందరూ భావిస్తుంటారు. పిల్లల తల్లిదండ్రులైతే మంచి ముహూర్తంలో మూడుముళ్లు వేయించాలని భావిస్తుంటారు. అందుకోసం అవసరమైతే నెలల తరబడి వేచి చూస్తుంటారు. మాఘమాసం విశిష్టత: మాఘమాసం తెలుగు సంవత్సరంలో పదకొండవ నెల. చంద్రుడు మఖ నక్షత్రంతో కూడుకున్న మాసం కాబట్టి ఇది మాఘమాసం అయింది. ఉత్తరాయణ పుణ్యకాలంలో వచ్చే ఈ మాసం విష్ణుమూర్తికి ప్రీతిప్రథమైనది.హిందువులకు కార్తీక మాసంలో పెట్టే దీపానికి ఎంత ప్రాముఖ్యత ఉందో.. మాఘమాసంలో చేసే స్నానానికి కూడా అంతే ప్రాముఖ్యత ఉంది.'మఘం' అంటే యజ్ఞం. యజ్ఞయాగాది క్రతువులకు మాఘమాసాన్ని శ్రేష్ఠమైనదిగా భావించి.. క్రతువులు నిర్వహించే వారు కనుక ఈ మాసం మాఘమాసమైంది. మాఘ స్నానం పవిత్రస్నానంగా భావిస్తారు. మాఘస్నాన మహాత్మ్యాన్ని బ్రహ్మాండ పురాణం పేర్కొంటోంది. మృకండుముని మనస్వినిల మాఘస్నాన పుణ్యఫలమే వారి కుమారుడైన మార్కండేయుని అపమృత్యువును తొలగించిందని పురాణ కథనం.నదీ స్నానం అర్ఘ్యం:మాఘమాసంలో ఈ స్నానాలకు అధిష్ఠానదైవం సూర్య భగవానుడు. స్నానానంతరం సూర్యునికి అర్ఘ్యం సమర్పించడం ఒక ఆచారం. మాఘ స్నానంలో దివ్య తీర్థాలను స్మరించి పాపవినాశనం కోరుతూ స్నానం చేయడం సంప్రదాయం.

## చలో నల్గొండ బహిరంగ సభను విజయవంతం చేయాలి : బీఆర్ఎస్



నల్గొండ : కృష్ణా నదీ జలాల పై తెలంగాణ హక్కులను కాపాడుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి ని వ్యతిరేకిస్తూ నిర్వహిస్తున్న చలో నల్గొండ ను విజయవంతం చేయాలని కోదాడ బీఆర్ఎస్ నాయకులు పిలుపునిచ్చారు. కోదాడ బీఆర్ఎస్ ఇన్‌చార్జి , మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్, ఎమ్మెల్సీ రవీంద్రరావు శనివారం కోదాడ పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో చలో నల్గొండకు సంబంధించిన వాల్‌పోస్టర్ ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ అనాలోచిత వైఖరి కృష్ణా బేసిన్ లోని దక్షిణ తెలంగాణ రైతాంగ సాగునీటి హక్కులపై గొడ్డలి పెట్టులా మారిందని ఆరోపించారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు నాయకత్వంలో నల్లగొండలో చలో నల్గొండ భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నామని వారు తెలిపారు.

# సినిమా తీరు

## పుష్ప-2పై కన్నేసిన నాని, చైతూ.. ఏం జరుగుతుందో?



టాలీవుడ్ మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా సినిమాల్లో పుష్ప: ది రూల్ ఒకటి. క్రియేటివ్ డైరెక్టర్ సుకుమార్ రూపొందిస్తున్న ఈ మూవీపై భారీ అంచనాలు ఉన్నాయి. పుష్ప పార్ట్ 1 వచ్చి రెండున్నర ఏళ్లు అవుతుంది. ఇంకా సీక్వెల్ ను రిలీజ్ చేయకపోవడం పై ఫ్యాన్స్ కాస్త అసహనంతో ఉన్నారు. దానికి తోడు అప్డేట్స్ కూడా పెద్దగా రావడం లేదు. గతంలో ఎప్పుడో ఫస్ట్ గ్లింప్స్ రిలీజ్ చేసి దర్శకుడు సుకుమార్ ఫ్యాన్స్ ను ఫుల్ ఖుషీ చేశారు.ఈబీశ్రీశ్రీబిఞతీవవని గ్లింప్స్ వీడియోతోనే ఈ సినిమాపై మూవీ లవర్స్ లో క్యూరియాసిటీ పెంచేశారు. ఆ హడావుడి చూసి 2023లోనే పుష్ప-2 థియేటర్లలోకి వస్తుందని అంతా అనుకున్నారు. తీరా చూస్తే 2024 ఆగస్టు 15వ తేదీన విడుదల చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. దీంతో మూవీ లవర్స్ పుష్ప 2 కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇటీవలే ఈ సినిమాకు మూడో పార్ట్ కూడా ఉంటుందని సినీ వర్గాల్లో పెద్ద ఎత్తున ప్రచారం సాగుతోంది. దీనిపై ఇప్పటి వరకు మేకర్స్ స్పందించకపోవడం గమనార్హం.పుష్ప-3 : రోర్ పేరుతో మూడో పార్ట్ రానుందంటూ తెగ వైరలవుతున్నాయి వార్తలు. అయితే బన్నీ ఫ్యాన్స్ మాత్రం.. పుష్ప-3 కోసం తమకు ఎలాంటి అప్డేట్ వద్దని, చెప్పిన తేదీకి సెకండ్ పార్ట్ రిలీజ్ చేయాలని కోరుతున్నారు. ఈ మూవీ షూటింగ్ ఇంకా చాలా పెండింగ్ ఉందని, రిలీజ్ వాయిదా పడుతుందని గతంలో వార్తలు వచ్చాయి. వాటిని చిత్రయూనిట్ ఖండించినా.. నెట్టింట ఇంకా అదే రూమర్ స్ప్రెడ్ అవుతోంది. ఇక డైరెక్ట్ గా సినిమాను రిలీజ్ చేసే మేకర్స్.. వాటికి చెక్ పెట్టాలి మరి.అయితే పుష్ప-2 ఒకవేళ వాయిదా పడితే.. ఆ రిలీజ్ డేట్ పై ఇప్పుడు ఇద్దరు టాలీవుడ్ స్టార్ల సినిమాల మేకర్స్ కన్నేశారు. పుష్ప పోస్ట్ పోన్ అయితే నేచురల్ స్టార్ నాని నటిస్తున్న సరిపోదా శనివారంతోపాటు యువ సామ్రాట్ అక్కినేని నాగచైతన్య తండేల్ మూవీలను ఆయా మేకర్స్ ఆగస్టు 15న రిలీజ్ చేయాలని యోచిస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. ప్రస్తుతం ఈ రెండు చిత్రాల షూటింగ్.. శరవేగంగా జరుగుతోంది. ఇటీవలే తండేల్ మేజర్ షెడ్యూల్ పూర్తైనట్లు ప్రకటించిన విషయం తెలిసిందే.క్ ఆత్రేయ దర్శకత్వంలో నాని సరిపోదా శనివారం మూవీ తెరకెక్కుతోంది. ఈ సినిమాలో ప్రియాంక ఆరుల్ మోహన్, ఎస్ జే సూర్య తదితరులు నటిస్తున్నారు. మరోవైపు, చందూ మొండేటి డైరెక్షన్ లో నాగ చైతన్య తండేల్ రూపుదిద్దుకుంటోంది. ఉత్తరాంధ్రకు చెందిన మత్స్యకారుల నిజజీవిత కథల ఆధారంగా ఈ సినిమా తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. అయితే పుష్ప మేకర్స్ ఆగస్టు 15వ తేదీని అస్సలు మిస్ చేసుకోవాలని అనుకోవడం లేదట. మరేం జరుగుతుందో వెయిట్ అండ్ సీ.

## మహేష్ బాబు మినహాయింపు కాదు సుమీ!




దర్శకధీరుడు ఎస్.ఎస్.రాజమౌళి ఏదైనా సినిమాని ప్రారంభించే ముందు ప్రీప్రొడక్షన్ సహా నటీనటుల ప్రీప్రాక్టీస్ కోసం చాలా సమయం వెచ్చిస్తారు. కఠిన ఆంక్షల నడుమ స్టార్లు తమ డేట్లను లాక్ చేసి సుదీర్ఘ కాలం పని చేయాల్సి ఉంటుంది. గతంలో ప్రభాస్ - రానా బృందం బాహుబలి - బాహుబలి 2 కోసం ఐదేళ్ల పాటు లాక్ అయ్యారు. సినిమా సెట్స్ పైకి వెళ్లక ముందే శారీరక పరివర్తన సహా నటన పరంగా చాలా ప్రీప్రాక్టీస్ చేసారు. ఆ తర్వాత ఆర్.ఆర్.ఆర్ కోసం రామ్ చరణ్ - ఎన్టీఆర్ కఠోరంగా శ్రమించారు. రెండేన్నరేళ్లు పైగానే ఆర్.ఆర్.ఆర్ కోసం షేపవుట్ అవ్వకుండా నిరంతరం కసరత్తులు చేస్తూ ఫిజికల్ ఫిట్ నెస్ ని మెయింటెయిన్ చేసారు వీరంతా. అందుకే ఆన్ ది స్క్రీన్ లుక్ పరంగా కూడా చరణ్ , ఎన్టీఆర్ మార్కులు కొట్టేసారుఇప్పుడు ఇదే తరహా శిక్షణ మహేష్ బాబుకు కూడా ఉండబోతోంది. రాజమౌళితో పని చేయాలనుకున్న ఏ హీరోకి అయినా మినహాయింపు అన్నది లేదు. మహేష్ కి కఠోర శిక్షణ తప్పనిసరి. ఞాఓః29 కోసం అతడు ఒక రూపాన్ని పొందడానికి ఇంకా చాలా నెలలు పడుతుంది. నెలల తరబడి సాగే భారీ వర్క్‌షాప్‌లు, రిహార్సల్స్‌లో మహేష్ బాబు సహా చిత్రబృందం పాల్గొంటారు. స్టార్‌డమ్‌తో సంబంధం లేకుండా ఏ హీరో అయినా రాజమౌళి సినిమా కోసం రూల్స్ ప్రకారం నడుచుకోవాలి. మహేష్ బాబు కూడా ఇందుకు మినహాయింపు కాదు. దానికి తగ్గట్టే జక్కన్న సూచనలు పాటిస్తూ మహేష్ తన రూపాన్ని అమాంతం మార్చేయబోతున్నారు. చాలా స్టైలిష్ గాను అతడు మారబోతున్నాడు. ఇప్పటికే విదేశీ లొకేషన్లలో వాతావరణాన్ని అలవాటు పడేందుకు మహేష్ తన ఫిట్నెస్ కోచ్ తో పాటు ప్రిపరేషన్ సాగించిన సంగతి తెలిసిందే.ముఖ్యంగా మహేష్ లుక్ పూర్తిగా ఒక హాలీవుడ్ స్టార్ కి ఏమాత్రం తగ్గకూడదనేది రాజమౌళి ఆలోచన అని తెలిసింది. దానికోసం మహేష్ ఎంతో క్రమశిక్షణతో కసరత్తులు చేస్తారు. రూపాన్ని పూర్తిగా మార్చేస్తారు.రాజమౌళి స్టైల్ అడ్వెంచర్ ఫిల్మ్‌తో మహేష్ బాబు ప్రేక్షకులకు షాక్ లివ్వడం ఖాయమన్న చర్చా సాగుతోంది. మహేష్ ఇప్పటికే జిమ్ లో అందుకు సంబంధించిన ఫోటోలను రిలీజ్ చేయగా, అభిమానులు సోషల్ మీడియాలో వైరల్ చేసిన సంగతి తెలిసిందే.

## డెలివరీ డేట్ కంటే ముందే ప్రసవించబోతుందనడానికి కొన్ని ముఖ్యమైన సంకేతాలు.!




ప్రసవం అనేది ప్రతి గర్భిణీ స్త్రీకి పునర్జన్మ లాంటిది. ఇది ప్రపంచానికి కొత్త జీవిని పరిచయం చేసే రోజు. అయితే గర్భధారణ సమయంలో గర్భిణి తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే చాలా సమస్యలు ఎదుర్కొంది ఎప్పటికప్పుడు, ఇటువంటి సమస్యలు గురించి అవగాహన కలిగి ఉండాలి. గర్భిణీ స్త్రీ మరియు ఆమె పరిసరాల గురించి భయపడతారు. గర్భాధారణలో చాలా క్లిష్టమైనది ప్రసవమే. కొంత మందికి డాక్టర్లు నిర్ణయించిన లేదా సూచించిన తేది కరెక్ట్ గా ఒకటి రెండు రోజులు ఇటో అటో ప్రసవం జరుగుతుంది. అయితే కొంత మందికి 9 నెలలు నిండి పదిలో పడ్డా ప్రసవం కాదు, మరికొందరికేమో డెలివరీ డేట్ నిర్ణీత తేదీకి ముందు సంభవిస్తుంది. దీనిని ముందస్తు డెలివరీ అంటారు. దీనిని శిశు జననం అంటారు, అప్పుడే పుట్టిన పసికందులను శిశువులు అంటారు. డెలివరీ డేట్ కంటే ముందుగా ప్రసవించిన శిశువుల్లో ఆరోగ్య సమస్యలు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, కామెర్లు మరియు న్యుమోనియా వంటి అంటువ్యాధులతో బాధపడే అవకాశం ఎక్కువగా ఉంది. కాబట్టి డాక్టర్లు సూచించిన డెలివరీ డేట్ కంటే ముందస్తు ప్రసవం సంకేతాలు మరియు లక్షణాలను విస్మరించవద్దు. గర్భిణీ స్త్రీలలో ఈ క్రింది లక్షణాలు కనిపిస్తే, వెంటనే స్త్రీ జననేంద్రియ నిపుణుడిని సంప్రదించడం మంచిది. లక్షణాలు: లక్షణాలు: గర్భాశయ సంకోచాలు గర్భం చివరి దశలలో గర్భాశయం సంకోచించవచ్చు. ఈ సంకోచం మరియు పెరిగినా, నొప్పి ఉంటే, అది తక్కువ జనన బరువుకు సంకేతం కావచ్చు. ఉదరం చుట్టూ ఒక తాడు బిగుతుగా బింగించిన నొప్పిని అనుభవించవచ్చు. ఈ నొప్పి తొలగిపోతుంది. కటి ఒత్తిడి కటి ఒత్తిడి గర్భం చివరి దశలలో కటి(వెన్నెముక లేదా నడుము) మీద అప్పుడప్పుడు ఒత్తిడి ఎక్కువగా ఉంటుంది. కానీ ఈ ఒత్తిడిని ఎక్కువగా అనుభవించినప్పుడు, ఇది తక్కువ జనన బరువుకు సంకేతంగా ఉంటుంది. హిప్ నొప్పికి కారణం శిశువు బయటపడటానికి ప్రయత్నిస్తుంది. ఈ నొప్పి శిశువు పుట్టే స్థితిలో ఉందని అర్థం. గర్భాశయంలోకి ఉమ్మనీరు ప్రవేశించడం గర్భాశయంలోకి ఉమ్మనీరు ప్రవేశించడం జననేంద్రియాలలో అకస్మాత్తుగా అధికంగా నీటి ఉత్సర్గ ఉంటే, వెంటనే వైద్యుడిని సంప్రదించడం చాలా ముఖ్యం. ముందస్తు ప్రసవం మరొక లక్షణం ఎర్ర రక్త ప్రవాహం లేదా నీటి ఉత్సర్గ. గర్భాశయ లేదా యోని తెరచుకోవడం వల్ల ఈ ప్రసవం జరుగుతుంది. నొప్పి నెలసరి నొప్పికి సమానమైన నొప్పి ప్రసవానికి సంకేతం. కడుపు నొప్పి విపరీతంగా ప్రారంభమయ్యే ఈ నొప్పి ప్రసవానికి ప్రారంభ సంకేతం. రాబోయే కొద్ది గంటల్లో నొప్పి తగ్గదు. ఎక్కువ వెన్నునొప్పి ఎక్కువ వెన్నునొప్పి మీకు వెన్ను దిగువ భాగంలో ఎక్కువ నొప్పి ఉంటే, మరియు మీకు కోలుకోలేని నొప్పి మరియు కూర్చోలేకపోతే వెంటనే వైద్యుడి వద్దకు వెళ్లడం మంచిది. ప్రసవం జరగబోయే ముందు వెన్నులో విపరీతమైన నొప్పి ఒత్తిడిని కలిగిస్తుంది. ఈ భావన ఓవర్‌లోడ్ అయిన అనుభూతి లాంటిది. శిశువు కదులికలు శిశువు కదులికలు గర్భాశయంలో శిశువు కదలికలో గణనీయమైన మార్పు ఉంటే, అది అకాల ప్రసవానికి సంకేతం. మీ బిడ్డ బొడ్డు నుండి దిగడానికి ప్రయత్నిస్తున్నట్లు మీకు అనిపిస్తే,దాన్ని విస్మ రించవద్దు. సంకేతాలు సంకేతాలు . మగత మరియు కళ్ళు మసకబారుతున్నట్లు అనిపిస్తుంది . దృష్టి అస్పష్టంగా ఉంటుంది . తలనొప్పి, జ్వరం మరియు చలి



## మొన్న శ్రీమంతుడు.. ఇప్పుడు బేబీ.. మేకర్స్ పై కేసు?

కంటెంట్ బాగుంటే చాలు.. సినిమాలు ఎంత పెద్ద హిట్ అవుతాయో అందరికీ తెలిసిందే. అలాంటి సినిమాల్లో బేబీ ఒకటి. సాయి రాజేష్ దర్శకత్వంలో గతేడాది వచ్చిన ఈ మూవీ సూపర్ హిట్ గా నిలిచింది. విజయ్ దేవరకొండ తమ్ముడు ఆనంద్ దేవరకొండ హీరోగా నటించిన ఈ మూవీలో వైష్ణవి చైతన్య హీరోయిన్ గా యాక్ట్ చేసింది. అందమైన ప్రేమ కథగా తెరకెక్కిన ఈ సినిమా ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది.ువతను ఆకట్టుకునే కథతో ఈ సినిమాను సాయి రాజేష్ తెరకెక్కించి మంచి ఫేమ్ సంపాదించారు. ఇక సోషల్ మీడియాలో విపరీతమైన ఫాలోయింగ్ సొంతం చేసుకుంది వైష్ణవి చైతన్య. తన నటనతో ఈ సినిమాలో మార్కులు కొట్టేసింది. ఈ మూవీ థియేటర్స్ లోనే కాదు ఓటీటీలో కూడా సూపర్ హిట్ గా నిలిచింది. బాలీవుడ్ లో ప్రస్తుతం ఈ సినిమా రీమేక్ అవుతోంది.తాజాగా ఈ సినిమా స్టోరీపై వివాదం తలెత్తినట్లు తెలుస్తోంది.బేబీ మూవీ స్టోరీ తనదేనని హైదరాబాద్ లోని రాయదుర్గం పోలీస్ స్టేషన్ లో షార్ట్ ఫిల్మ్ డైరెక్టర్ కమ్ సినిమాటోగ్రాఫర్ శిరిన్ శ్రీరామ్ ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఆ సినిమా కథను తాను కొన్నేళ్ల క్రితమే మేకర్స్ కు చెప్పినట్లు శిరిన్ శ్రీరామ్ ఫిర్యాదులో పేర్కొన్నారట. కాపీరైట్ చట్టాన్ని బేబీ మేకర్స్ ఉల్లంఘించారని ఆరోపించారట. 2013లో ఓ సినిమా విషయంలో రాజేష్ తో పరిచయం ఏర్పడినట్లు శ్రీరామ్ చెప్పారట.2015లో తాను రాసుకున్న కథకు ప్రేమించొద్దు అనే టైటిల్ పెట్టుకున్నట్లు శిరిన్ శ్రీమ్ ఫిర్యాదులో చెప్పారట. ఆ కథనే సాయి రాజేష్ సజెషన్ తో ప్రొడ్యూసర్ ఎస్ కే ఎన్ కు వివరించానని పేర్కొన్నారట. ఆ స్టోరీయే బేబీ టైటిల్ తో తెరకెక్కిందని శ్రీరామ్ ఆరోపిస్తున్నారట. ఆ మూవీ కథ మొత్తం తనదేనని శిరిన్ శ్రీరామ్ పోలీసులకు ఫిర్యాదు చేశారట. ఈ విషయంపై అధికారిక వివరాలు తెలియాల్సి ఉంది.ప్రస్తుతం ఇండస్ట్రీలో ఈ విషయం హాట్ టాపిక్ గా మారింది. ఇప్పటికే శ్రీమంతుడు సినిమా స్టోరీపై ఇష్యూ నడుస్తున్న విషయం తెలిసిందే. రైటర్ శరత్ చంద్ర అలియాస్ ఆర్డీ విల్సన్ ఈ సినిమాపై కాపీరైట్ కేసును నమోదు చేశారు. తన చచ్చేంత ప్రేమ నవల నుంచి శ్రీమంతుడు స్టోరీని కాపీ కొట్టారని ఆరోపించారు. ఇంకా ఈ కేసు ఓ కొలిక్కి రాకముందే.. తెరపైకి బేబీ సినిమా స్టోరీ వివాదం రావడం గమనార్హం.

**అందానికే మరో అందం....**



## ఈగల్ 'అనుపమ'ను యూత్ రిసీవ్ చేసుకుంటారా?



టాలీవుడ్ లో వరుస ఛాన్సులు దక్కించుకుంటూ దూసుకుపోతున్న బ్యూటీ అనుపమ పరమేశ్వరన్. ఇటీవలే మాస్ మహారాజా రవితేజతో కలిసి ఈగల్ మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. దీంతోపాటు డీజే టిల్లు ఫేమ్ సిద్దు జొన్నలగడ్డ హీరోగా రాబోతున్న టిల్లు స్క్వేర్ సినిమాతో కూడా త్వరలోనే సందడి చేయనుంది. జయం రవి, కీర్తి సురేష్ కీలక పాత్రల్లో నటించిన సైరెన్ లోనూ అనుపమ నటిస్తోంది. మరో మలయాళ సినిమా కూడా చేస్తోది. అలా వరుస సినిమాలతో బిజీగా ఉన్న ఈ అమ్మడు.. ఈగల్ మూవీతో సూపర్ హిట్ కొట్టేసింది. అందులో అనుపమ లీడ్ రోల్ పోషించి మంచి మార్కులు సంపాదించుకుంది. హీరో ఫ్లాష్ బ్యాక్ చెప్పే జర్నలిస్ట్ పాత్రలో కనిపించి తన నటనతో ఆకట్టుకుంది. ఇంతకుముందు అన్ని సినిమాల్లో ఫుల్ గ్లామరస్ రోల్స్ లో కనిపించిన ఈ బ్యూటీ.. ఈగల్ లో మాత్రం పూర్తిగా డీ గ్లామరస్ పాత్రలో నటించింది. అయితే ఈగల్ లో చేసిన క్యారెక్టర్ కు విరుద్ధంగా సిద్ధు టిల్లు స్క్వేర్ లో కనిపించనుంది అనుపమ. ఫుల్ గ్లామరస్ గా టీజర్ తోపాటు గ్లింప్స్ లో కనిపిస్తోంది. హీరోతో ఘాటు రొమాన్స్ చేస్తున్నట్లు పోస్టర్లలో పోజులు ఇచ్చింది. ఇటీవలే రిలీజైన టిల్లు స్క్వేర్ గ్లింప్స్ లో కూడా అనుపమ యమా స్టైలిష్ గా కనిపించింది. ఈగల్ లో మాత్రం ఫుల్ డీ గ్లామరస్ లుక్ లో నటించింది. దీంతో టిల్లు స్క్వేర్ లో నటించిన అనుపమ, ఈగల్ లో అనుమమ ఒకరేనా అని చాలా మంది నెటిజన్లు ఆశ్చర్యపోతున్నారట. అయితే ఈగల్ సినిమాలో ఈ బ్యూటీని డీ గ్లామరస్ రోల్ లో చూసిన నెటిజన్లు.. టిల్లు స్క్వేర్ లో అనుపమను ఎలా రిసీవ్ చేసుకుంటారో చూడాలని సినీ పండితులు అంటున్నారు. కానీ ఏ రోల్ అయినా అనుపమ అదరగొడుతుందని, టిల్లు స్క్వేర్ తో సూపర్ హిట్ కొడుతుందని ఫ్యాన్స్ చెబుతున్నారు. ఇక ఇటీవలే ఈగల్ మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్ లో చేసిన ఓ పనితో అనుపమ ఇప్పటికీ ట్రెండ్ అవుతోంది. డైరెక్టర్ కార్తీక్ ఘట్టమనేనితో ఇప్పటికే నాలుగు సినిమా చేసిన అనుపమ.. ఆయనకు స్టేజ్ పైనే రాఖీ కట్టేసింది. అన్నయ్యా అంటూ పిలుస్తూ ఆత్మీయంగా హగ్ ఇచ్చింది. అయితే చాలా ఫ్రెండ్లీగా జోవియల్ గా మూవ్ అయ్యే అతి కొద్ది మంది హీరోయిన్లలో అనుపమ ఒకరు అంటూ ఫ్యాన్స్ కొనియాడుతున్నారు.

## భారత జట్టు ప్రకటన.. అనుకున్నదే జరిగింది! యువ ఆటగాడు ఎంట్రీ



ఇంగ్లండ్‌తో ఆఖరి మూడు టెస్టులకు 17 మంది సభ్యులతో కూడిన భారత జట్టును బీసీసీఐ సెలక్షన్ కమిటీ ప్రకటించింది. అయితే అందరూ అనుకున్నదే జరిగింది. సిరీస్‌లో మిగిలిన మూడు మ్యాచ్‌లకు కూడా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి వ్యక్తిగత కారణాలతో దూరమయ్యాడు.ఫ్యామిలీ ఎమర్జెన్సీ కారణంగా దూరంగా ఉండాలని విరాట్ నిర్ణయించుకున్నట్లు భారత క్రికెట్ బోర్డు ఓ ప్రకటనలో వెల్లడించింది.ఇక కోహ్లితో పాటు మిడిలార్డర్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్ వెన్ను గాయం కారణంగా సిరీస్‌లో మిగిలిన మ్యాచ్‌లకు దూరమయ్యాడు. అయితే తొడకండరాల గాయం కారణంగా రెండో టెస్టుకు దూరమైన స్టార్ ఆటగాళ్లు రవీంద్ర జడేజా, కేఎల్ రాహుల్.. తిరిగి జట్టులోకి వచ్చారు. కానీ వారిద్దరూ ప్రధాన జట్టులో చోటు దక్కించుకున్నప్పటికీ.. తుది జట్టులోకి రావాలంటే తమ ఫిట్‌నెస్‌ను నిరూపించుకోవాల్సిందే.బీసీసీఐ మెడికల్ టీమ్ నుంచి క్లియర్స్‌ను పొందితేనే తుది జట్టు ఎంపికకు అందుబాటులో ఉంటారు. ఇక ఆల్‌రౌండర్ సౌరభ్ కుమార్,అవేష్ ఖాన్‌ను జట్టు నుంచి రిలీజ్ చేసిన సెలక్షన్ కమిటీ.. బెంగాల్ పేసర్ ఆకాష్ దీప్‌కు తొలిసారి భారత టెస్టుకు ఎంపిక చేసింది.అదే విధంగా రెండు టెస్టుకు భారత జట్టులోకి వచ్చిన సర్ఫరాజ్ ఖాన్, వాషింగ్టన్ సుందర్‌ను సెలక్టర్లు కొనసాగించారు. ఇక ఫిబ్రవరి 15 నుంచి రాజ్‌కోట్ వేదికగా రెండో టెస్టు ఆరంభం కానుంది.ఇంగ్లండ్‌తో మూడు టెస్టుకు భారత జట్టు: రోహిత్ శర్మ (కెప్టెన్), జస్ప్రీత్ బుమ్రా (వైస్ కెప్టెన్), యశస్వి జైస్వాల్, శుభమన్ గిల్, కెఎల్ రాహుల్×, రజత్ పటీదార్, సర్ఫరాజ్ ఖాన్, ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్), కెఎస్ భరత్ (వికెట్ కీపర్), ఆర్ అశ్విన్, రవీంద్ర జడేజా×, అక్షర్ పటేల్ , వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్, మహ్మద్ సిరాజ్, ముఖేష్ కుమార్, ఆకాష్ దీప్

## నా రిటైర్మెంట్ అప్పుడే..! తేల్చేసిన వార్నర్ భాయ్



ఇటీవలే టెస్టులతో పాటు వన్డేలకు రిటైర్మెంట్ ప్రకటించి ఒకే ఒక్క టీ20 ఫార్మాట్‌లో ఆడుతున్న ఆస్ట్రేలియా సీనియర్ బ్యాటర్ డేవిడ్ వార్నర్.. అంతర్జాతీయ స్థాయిలో ఆటకు గుడ్‌బై చెప్పబోయే టైమ్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. స్వల్ప విరామం తర్వాత ఆస్ట్రేలియా జాతీయ జట్టులోకి వచ్చిన వార్నర్.. వెస్టిండీస్‌తో శుక్రవారం ముగిసిన తొలి టీ20లో 36 బంతుల్లోనే 70 పరుగులు చేసి సత్తా చాటాడు. ఈ మ్యాచ్ ముగిసిన తర్వాత వార్నర్ మాట్లాడుతూ.. ఈ ఏడాది యూఎస్‌ఎ, వెస్టిండీస్ వేదికగా జరగాల్సి ఉన్న టీ20 వరల్డ్ కప్ తర్వాత ఆటకు రిటైర్మెంట్ ప్రకటిస్తానని తేల్చేశాడు.మ్యాచ్ అనంతరం వార్నర్ మాట్లాడుతూ? 'స్వల్ప విరామం తర్వాత తిరిగి జాతీయ జట్టులోకి రావడం, మ్యాచ్ విన్నింగ్ ప్రదర్శన చేయడం సంతోషంగా ఉంది. నేను ఈ ఏడాది టీ20 వరల్డ్ కప్ వరకు ఆడి అక్కడే ఆటకు గుడ్‌బై చెప్పేద్దామని భావిస్తున్నా. రాబోయే ఐదారు నెలలు మాకు అత్యంత కీలకం. విండీస్‌తో సిరీస్ ముగిశాక మేం న్యూజిలాండ్‌తో సిరీస్ ఆడాల్సి ఉంది. అది కూడా ముఖ్యమైన సిరీసే..'అని అన్నాడు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY BYAGAL SRINIVAS, PRINTED AT S.S. PRINTERS & FILE MAKERS, PUS ALAGALLY, JAWAHAR ROAD, Town & Dist.NIZAMABAD- 503001, TELANGANA STATE, PUBLISHED AT H.NO: 6-11-174/1, NAMDEVWADA, Town & Dist. NIZAMABAD, TELANGANA STATE - 503001.EDITOR: BYAGAL SRINIVAS.